


ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	503.80 (121.3844)	నిల్	800
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	637.55 (2.68)	59.87	నిల్
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	95.24 (0.43)	694	50

చికెన్ ధరలు | లైవ్ : రూ.134 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.224

ఉమ్మడి జిల్లాలో డెంగీ పంజా విసురుతోంది. ఇటీవల నల్లగొండ జిల్లా కేంద్రానికి చెందిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయురాలు డెంగీ లక్షణాలతో మృత్యువాతపడ్డారు. ఒక్క నల్లగొండ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 20 డెంగీ కేసులు నమోదయ్యాయి. నకిరేకల్ నియోజకవర్గంలో నాలుగు డెంగీ కేసులు నమోదయ్యాయి. యాదాద్రి జిల్లాలో జనవరి నుంచి ఇప్పటి వరకు నాలుగు డెంగీ కేసులను వైద్యాధికారులు గుర్తించారు. ఇటీవల సూర్యాపేట జిల్లాలోని హుజూర్‌నగర్ మండలం బూరుగడ్డ గ్రామంలో విషజ్వరాలతో ప్రజలు మంచానపడ్డారు. వర్షాకాలంలో అపరిశుభ్రత కారణంగా దోమల వ్యాప్తి పెరిగింది. ఫలితంగా ప్రజలు విషజ్వరాలు, డెంగీ బారినపడుతున్నారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు డెంగీ కేసులను తక్కువగా చూపుతుండగా, క్షేత్రస్థాయిలో ఈ సంఖ్య ఎక్కువగానే ఉంది.

- సూర్యాపేట, నల్లగొండ, నార్కట్‌పల్లి, కోదాడ, చౌటుప్పల్, దేవరకొండ, భువనగిరి రూరల్, ఆలేరు, హాలియా



భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు

డెంగీ పంజా

ఉమ్మడి జిల్లాలో డెంగీ క్రమంగా విస్తరిస్తోంది. ఇటీవల సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్, తుంగతుర్తి, పెన్‌పహాడ్‌తో పాటు సూర్యాపేట, కోదాడ పరిధిలోని పలు గ్రామాల్లో ప్రజలు విషజ్వరాలతో అల్లాడుతున్నారు. వీటిలో కొన్ని డెంగీ కేసులు నమోదైనట్టు సమాచారం. నల్లగొండ నియోజకవర్గంలో ఇప్పటికే 20 డెంగీ కేసులు నమోదయ్యాయి. నల్లగొండ నియోజకవర్గ పరిధిలోని తిప్పర్తి పీహెచ్‌సీ పరిధిలో ఆరు డెంగీ కేసులు, నల్లగొండ మండల పరిధిలోని రాములబండా గ్రామంలో మూడు, కనగల్ మండల పరిధిలో నాలుగు కేసులు నమోదయ్యాయి. నల్లగొండ పట్టణంలోని మాన్యంచెల్క అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో నాలుగు కేసులు, పానగల్ అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో మూడు కేసులు నమోదయ్యాయి. గడిచిన పది రోజుల్లో నకిరేకల్ నియోజకవర్గ వ్యాప్తంగా నాలుగు డెంగీ కేసులను గుర్తించారు. నార్కట్‌పల్లి, చిట్యాల మండలాల్లో ఒకటి చొప్పున, నకిరేకల్‌లో రెండు డెంగీ కేసులు నమోదయ్యాయి. డెంగీ కేసుల సంఖ్య ఇంకా ఎక్కువ ఉండే అవకాశం ఉంది. పలువురు హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నట్టు సమాచారం. నియోజకవర్గంలో రామన్నపేట, నకిరేకల్‌లో మాత్రమే 50 పడకల ఏరియా ఆస్పత్రులు ఉన్నాయి. కట్టంగూరు మినహా మిగతా మండలాల్లో రెండు చొప్పున ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీ)లు ఉన్నాయి. చిట్యాల పట్టణంలోని పీహెచ్‌సీ మాత్రం 24 గంటల ఆస్పత్రిగా సేవలందిస్తోంది. ఏరియా ఆస్పత్రుల్లో అక్కడే రక్తనమూనాలు సేకరించి పరీక్షలు చేసి నిర్ధారిస్తున్నారు. పీహెచ్‌సీల్లో మాత్రం టీ-హబ్, మొబైల్ వాహనాల ద్వారా జ్వర పీడితుల రక్తనమూనాలను సేకరించి పరీక్షలు చేయిస్తున్నారు. డెంగీగా నిర్ధారణ అయితే చికిత్స చేస్తున్నారు. ప్లేట్‌లెట్స్ పడిపోయి పరిస్థితి ఆందోళనకరంగా ఉంటే నల్లగొండ ప్రభుత్వాస్పత్రికి తరలించి ఇన్ పేషెంట్‌గా చికిత్స అందిస్తున్నారు. సూర్యాపేట జనరల్ ఆస్పత్రిలో ప్రతీ రోజు 810 దాకా ఓపీ ఉంటుంది. డెంగీతో పాటు విషజ్వరాలు ప్రబలుతుండటంతో ఇటీవల ఈ సంఖ్య 1180 వరకు పెరిగింది. గత నెల మొదటి వారం సాధారణ రోజుల్లో 600 దాకా ఉంది. జ్వరపీడితుల కారణంగా నెల రోజుల్లో ఓపీ సుమారు 300 వరకు పెరిగింది. కోదాడ నియోజకవర్గంలో ప్రతీ గ్రామంలో సుమారు పది మందికి పైగా జ్వరాలతో బాధపడుతున్నారు. నిత్యం రెండు నుంచి మూడు డెంగీ కేసులు నమోదవుతున్నట్టు అనధికారిక సమాచారం. కోదాడ పట్టణానికి రోజుకు 100కి పైగా జ్వరంతో రోగులు ఆస్పత్రి బాటపడుతున్నారు. అటు ప్రభుత్వ, ఇటు ప్రైవేట్ ఆస్పత్రుల్లో జలుబు, జ్వరం విరేచనాలు, దగ్గు తదితర సమస్యలతో బాధపడుతూ వస్తున్న రోగులే అధికంగా కనిపిస్తున్నారు. దీనికి తోడు కీళ్ల, కాళ్ల నొప్పుల సమస్యలతో బాధపడుతున్న కేసులు అధికంగా నమోదవుతున్నాయి. చౌటుప్పల్ సివిల్ ఆస్పత్రిలో రోజు 200 నుంచి 250 మంది వరకు ఓపీ ఉంటోంది.

మర్రిగూడెం మండలంలో ప్రతీ రోజు 120 వరకు ఉండే ఓపీ సంఖ్య ఇటీవల 150 వరకు చేరింది. సంస్థాన్‌నారాయణపురం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సాధారణ రోజుల్లో 90 ఉండే ఓపీ సంఖ్య ప్రస్తుతం 120 వరకు పెరిగింది. చండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోజు 100వరకు ఓపీ నమోదవుతోంది. ప్రస్తుతం అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఆస్పత్రికి వచ్చే రోగుల్లో అధిక సంఖ్యలో జ్వరపీడితులు ఉంటున్నారు. మునుగోడు, గట్టుప్పల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి దేవరకొండ మండలంతో పాటు, చందంపేట, నేరేడుగొమ్ము, నాంపల్లి, మర్రిగూడ, గుర్రంపోడు, డిండి, పీఏపల్లి, కొండమల్లేపల్లి మండలాల నుంచి రోగులు వస్తుంటారు. గత నెలలో రోజుకు 400 నుంచి 500 వరకు ఓపీ ఉండగా, ప్రస్తుతం 600 నుంచి 700వరకు పెరిగింది. దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రిలో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు ఓపీ సేవలు అందిస్తున్నారు. యాదాద్రి జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి జూన్ నెల వరకు నాలుగు డెంగీ కేసులను వైద్య ఆరోగ్యశాఖ అధికారులు గుర్తించారు.

డెంగీ లక్షణాలు

ఎడిస్‌ఈజిప్ట్ దోమ కుట్టడం వల్ల డెంగీ ప్రబలుతోంది. ఈ దోమలు పగటి పూటనే కుడతాయి. ఎక్కువగా మంచినీటిలో ఈ దోమలు వృద్ధి చెందుతుంటాయి. కళ్లలో నొప్పితో పాటు శరీరంపై దద్దుర్లు రావడం, వాంతులు, విరేచనాలు, చిగుళ్లు, ముక్కు నుంచి రక్తస్రావం అవుతుంటుంది. క్రమంగా తెల్ల రక్తకణాల సంఖ్య తగ్గుతుంది. తీవ్రమైన జ్వరం వస్తుంది. అకస్మాత్తుగా ఎముకలు, కండరాలు, కీళ్ల నొప్పులతో జ్వరం వస్తుంది. జ్వరం తగ్గినట్లే అనిపించడంతో పాటు వారం, పది రోజుల్లో మళ్లీ జ్వరం వస్తుంటుంది. తెల్ల రక్తకణాల సంఖ్య 30వేల దిగువకు పడిపోతే ప్రాణానికే ముప్పు. ఈ లక్షణాలు కనపడగానే వెంటనే వైద్యుల వద్దకు వెళ్లి చికిత్స పొందాలి. సాధారణంగా ఎడిస్‌ఈజిప్ట్ దోమ కాటేసిన తర్వాత ఐదు నుంచి ఏడు రోజుల తరువాత డెంగీ లక్షణాలు కనపడతాయి.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



వర్షాలు కురుస్తున్నందున వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ముందస్తు జాగ్రత్తలతోనే సంపూర్ణ ఆరోగ్యం. జ్వర వ్యాధి లక్షణాలు కనిపించిన వ్యక్తులు వెంటనే ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందాలి. దోమలు వృద్ధి చెందకుండా ఉండాలంటే ఇళ్లతోపాటు, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. పరిశుభ్రమైన ఆహారాన్ని భుజించాలి.

- కోటాచలం, సూర్యాపేట డీఎంహెచ్‌వో

దోమల వ్యాప్తి నివారణకు చర్యలు

డెంగీ, చికున్‌గున్యా దోమ కారణంగా వ్యాప్తి చెందుతాయి. జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి జూన్ నెల వరకు నాలుగు డెంగీ కేసులు నమోదయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ప్రతీ శుక్రవారం డ్రైడే నిర్వహించేలా వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లకు ఆదేశాలు ఇచ్చాం. మునిసిపాలిటీ, గ్రామ పంచాయతీ సిబ్బంది సమన్వయం చేసుకుని గ్రామాల్లో పర్యటిస్తూ అపరిశుభ్ర ప్రాంతాలను శుభ్రం చేయించాలి. మురుగు గుంతలను పూడ్చివేయడంతో పాటు నీటి నిల్వ ఉన్న సంపులు, తొట్లు, నాచుతో కూడి ఉన్న ప్రాంతాల్లో దోమ లార్వా వ్యాప్తి చెందకుండా నీటిని తొలగించాలి. లార్వా నివారణకు మురుగు గుంతల్లో ఆయిల్ బాల్స్ వేస్తుండడంతో పాటు మురుగు కాల్వల్లో టీమోఫాస్ పిచికారీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

- డాక్టర్ వై.పాపారావు, డీఎంహెచ్‌వో, యాదాద్రి

ఆస్పత్రికి రోగుల సంఖ్య పెరిగింది



దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి రోగుల సంఖ్య ఇటీవల విపరీతంగా పెరిగింది. రోజుకు 700నుంచి 800మంది వరకు జ్వరం, మలేరియా,కీళ్లనొప్పులు, కాళ్లనొప్పులు, ఇతర వ్యాధులతో బాధపడుతూ ఆసుపత్రికి వైద్యంకోసం వస్తున్నారు.ఆస్పత్రిలో వైద్యులు,సిబ్బంది అందుబాటులో ఉండి రోగులకు వైద్యసేవలు అందిస్తున్నారు. సీజన్ వ్యాధులపై అంతా అప్రమత్తంగా ఉండాలి.

- డాక్టర్ రాములునాయక్, దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్

» ప్రబలుతున్న విషజ్వరాలు » ఆస్పత్రుల్లో పెరుగుతున్న రోగుల సంఖ్య

ప్రైవేట్‌లో దోపిడీ



కొందరు జ్వర బాధితులు ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లకుండా ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకుంటున్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో డెంగీ చికిత్సకు ఒక్కో రోగి నుంచి రూ.40వేలు మొదలు లక్షల రూపాయలు చికిత్స పేరుతో దోపిడీ చేస్తున్నారు. ప్లేట్‌లెట్స్ తగ్గాయని, వాటిని ఎక్కించాలని రోగుల జేబును గుల్ల చేస్తున్నారు. సాధారణ జ్వరానికి వెళ్లినా ఐసీయూలో ఉంచి చికిత్స చేసి లక్షల రూపాయల బిల్లులు వసూలుచేస్తున్నారు.



దేవరకొండ ఆస్పత్రిలో ఓపీ నమోదుచేయించుకుంటున్న రోగులు


డెంగీ నమోదైతే

డెంగీ కేసులు నమోదైతే ఆరోగ్య సిబ్బంది ప్రత్యేక నివారణ చర్యలు చేపడుతారు. డెంగీ బాధిత వ్యక్తి ఇంటి పరిసరాల్లోని 50 మీటర్ల వరకు పైరెత్రమ్ అనే మందును పిచికారీ చేస్తారు. 19 లీటర్ల కిరోసిన్‌కు లీటరు పైరెత్రమ్ అనే ద్రవణాన్ని కలిపి పిచికారీ చేస్తారు. ఇలా చేయడం ద్వారా దోమలు నశిస్తాయి. వాటితో పాటు దోమల గుడ్లు కూడా ధ్వంసమవుతాయి.

ఫాగింగ్ కరువు

డెంగీ ప్రబలడానికి కారణమైన దోమల నివారణకు మునిసిపాలిటీలు, గ్రామపంచాయతీలు చేయాల్సిన ఫాగింగ్ చేయడం లేదు. చాలా గ్రామ పంచాయతీల్లో ఫాగింగ్ యంత్రాలు లేవు. ఉన్న కొన్ని చోట్ల పనిచేయడం లేదు. ఒక్కసారి ఫాగింగ్ చేయాలంటే కనీసం రూ.25,000 ఖర్చు అవుతుండటంతో నిధుల కొరత కారణంగా ఫాగింగ్ చేయడం లేదని తెలుస్తోంది.

వృద్ధి చెందుతున్న దోమలు



ఇటీవల కురుస్తున్న వర్షాలకు దోమలు వృద్ధి చెందుతున్నాయి. పట్టణాల్లో మురుగు కాల్వలను సరిగా శుభ్రం చేయకపోవడంతో దోమలు పెరుగుతున్నాయి. గ్రామాల్లో మురుగు కాల్వల నిర్మాణాలు సరిగా లేవు. ఎక్కడ పడితే అక్కడ మురుగు నీరు నిలుస్తోంది. ఖాళీ ప్రదేశాల్లో నిల్వ ఉన్న నీటిలో దోమలు వృద్ధి చెందుతున్నాయి. నీటి గుంతలతో పాటు మురుగు కాల్వలు, పగిలిన కుండలు, తొట్లు, డ్రమ్ముల్లో నీటి నిల్వ కారణంగా దోమల వ్యాప్తి పెరుగుతోంది. ప్రతీ శుక్రవారం డ్రైడే నిర్వహించాల్సి ఉండగా ఇది పకడ్బందీగా అమలు కావడం లేదు. వర్షాకాలంలో పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి అధికారులు చేతులు దులుపుకుంటున్నారు గానీ విష జ్వరాలు ప్రబలకుండా ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదనే ఆరోపణలు ఉన్నాయి.

ముందస్తు జాగ్రత్తలు పాటించాలి



భువనగిరి మండలం చందుపట్లలో డ్రైడేలో భాగంగా నీటి సంపును పరిశీలిస్తున్న వైద్యశాఖ అధికారులు

డెంగీ రాకుండా ఉండేందుకు ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రధానంగా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. వారంలో ఒక రోజును డ్రైడేగా పాటించి ఇంటిలో నీరు నిల్వ ఉండే ట్యాంకులు, గాబులను శుభ్రం చేసుకోవాలి. పాత టైర్లు, నీటి ట్యాంకులు, పూల తొట్లలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు పాటించాలి. దోమ తెరలు, దోమల నివారణకు విక్రయించే వివిధ కంపెనీల లిక్విడ్లు, మస్కిటో కాయిల్స్‌ను ఉపయోగించుకోవాలి. వర్షపు నీరు నిల్వ ఉన్న చోట ఆయిల్ బాల్స్‌ను ఉపయోగించాలి. డ్రైనేజీల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా, వీధుల్లో పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలి. మరుగుదొడ్ల పైపులకు జాలి, లేదా పలుచని వస్త్రం కట్టాలి.

మూడు రోజులపాటు ప్రత్యేక

పారిశుధ్య కార్యక్రమం

కలెక్టర్ సి.నారాయణ రెడ్డి

నల్లగొండ టౌన్, జూలై 6: జిల్లాలోని అన్ని మునిసిపాలిటీలు, గ్రామపంచాయతీల్లో రానున్న మూడు రోజులపాటు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. శనివారం జిల్లా అధికారులు, మండలాల ప్రత్యేక అధికారులు, గ్రామపంచాయతీల ప్రత్యేక అధికారులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఆవరణతోపాటు, ఇతర ప్రభుత్వ సంస్థలు, రహదారులకు ఇరువైపులా పిచ్చి మొక్కలు, చెత్తా, చెదారాన్ని తొలగించాలన్నారు. గ్రామాల్లో ఎక్కడ మురుగు కాల్వలు నిండిపోకుండా చెత్తా, చెదారం అడ్డు రాకుండా తొలగించాలని, ప్రతీ ప్రభుత్వ సంస్థ ఆవరణలో శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. అన్ని కార్యాలయాల్లో తాగునీరు ఏర్పాటు చేయడమే కాకుండా మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచాలన్నారు.

బుధవారం వరకు అన్ని గ్రామాల్లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించి శుభ్రంగా ఉంచాలని, గురువారం ప్రజావాణి తర్వాత తనిఖీ చేయనున్నట్లు తెలిపారు. జిల్లాస్థాయిలో అన్ని కార్యాలయాల ఆవరణలను శుభ్రంచేసే కార్యక్రమాన్ని ఇదివరకే చేపట్టినట్లు తెలిపారు. సోమవారం మండల స్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి గ్రామ పంచాయతీ కార్యదర్శులు హాజరుకావాలన్నారు. మండలస్థాయి ప్రజావాణి కార్యక్రమంలో ఒక్కో గ్రామపంచాయతీవారీగా సమగ్రంగా సమీక్ష చేయాలని ఎంపీడీవోలను ఆదేశించారు. అనంతరం మండల స్థాయిలో కోఆర్డినేషన్ సమావేశాన్ని నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, జిల్లా అధికారులు, మండలాల ప్రత్యేక అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

జలశక్తి అభియాన్ పనులు భేష్

కేంద్ర జల వనరుల శాఖ సహాయ కార్యదర్శి దివాకర్ మహంతి



గుడిపల్లిలో పనులను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

పెద్దఅడిశర్లపల్లి, జూలై 6: ఉపాధిహామీ పథకంలో జలశక్తి అభియాన్ ద్వారా చేపట్టిన పనులు చాలా బాగున్నాయని కేంద్ర జల వనరుల శాఖ సహాయ కార్యదర్శి దివాకర్ మహంతి అన్నారు. శనివారం గుడిపల్లి మండలంలో జలశక్తి అభియాన్ ద్వారా చేపట్టిన బత్తాయి మొక్కలు, ఆయిల్‌పామ్, దొండ పందిళ్లు, ఇంకుడు గుంతల నిర్మాణం, హరితహారం మొక్కల పెంపకం, నర్సరీలను ఆయన పరిశీలించారు. నర్సరీలో మొక్కల పెంపకం, నిర్వహణ బాగుందని పంచాయతీ కార్యదర్శిని అభినందించారు. అనంతరం వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా రైతు వేదిక వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో నాగిరెడ్డి, క్లస్టర్ ఏపీడీ బాలకృష్ణ, ఎంపీడీవో చంద్రమౌళి, ఎంపీవో వెంకన్న, ఏపీవో శ్రీనివాస్, టీఏలు, సీసీలు, ఎఫ్ఏలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

చింతపల్లి: గ్రామాల్లో పర్యావరణాన్ని పరిరక్షించాలని కేంద్ర జల వనరుల శాఖ సహాయ కార్యదర్శి దివాకర్ అన్నారు. చింతపల్లి మండలంలోని గొడుకొండ్ల గ్రామంలో జలశక్తి అభియాన్‌లో భాగంగా శనివారం మొక్కలునాటి ఇంకుడు గుంతలను పరిశీలించారు. కార్యక్రమంలో డీఆర్డీఏ మహంతి, డీఆర్డీవో నాగిరెడ్డి, సహాయ సంచాలకులు బాలకృష్ణ, ఎంపీడీవో సుజాత, ఎంపీవో తస్నీరు ప్రవీణ్ శ్రీధర్, ఏపీవో శౌరి రెడ్డి, సాంకేతిక నిపుణులు సుధీర్, జహంగీర్, పాల్గొన్నారు.



డుమ్మా కొడితే.. దొరికినట్టే!

- » వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక యాప్
- » యాప్ రూపకల్పనకు కలెక్టర్ నిర్ణయం
- » ఇప్పటికే వికారాబాద్, నిజామాబాద్‌లో విజయవంతంగా అమలు
- » విధులకు కచ్చితంగా హాజరయ్యేలా కార్యాచరణ

నల్లగొండ,జూలై 6: వైద్యఆరోగ్యశాఖలో సిబ్బంది జవాబుదారితనం, రోగులకు మెరుగైన సేవలు అందించడం కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించనున్నారు. ఇందుకోసం నల్లగొండ జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకురానుంది. జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న సిబ్బంది, ఉద్యోగులు, అధికారులు, డాక్టర్లు కచ్చితంగా విధులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోనున్నారు. చాలామంది సిబ్బంది ఆలస్యంగా విధులకు హాజరుకావడం, హాజరు వేసుకొని తిరిగి వెళ్లిపోవడం పరిపాటిగా మారింది. అదే విధంగా మొక్కుబడిగా కార్యాలయానికి రావడం, సమయపాలన పాటించకపోవడంతో వైద్య ఆరోగ్యశాఖలో సమస్యలు చుట్టుముడుతున్నాయి. దాదాపు పీహెచ్‌సీలతోపాటు ఇతర అర్బన్ సెంటర్లు అన్ని కలిపి నల్లగొండ జిల్లాలో దాదాపు 40వరకు ఉన్నాయి.

కొంతమంది స్థానికంగా ఉండకపోవడం, మరికొంత మంది హైదరాబాద్ వంటి ప్రాంతాల నుంచి ఇంకా సరిహద్దు జిల్లాల్లో ఉంటూ ఆలస్యంగా విధులకు వస్తుండటంతో పారదర్శకంగా సేవలు అందడం లేదని జిల్లా యంత్రాంగం గుర్తించింది. హాజరు రిజిస్టర్‌లో సమయానికి వచ్చి సంతకం చేస్తున్నారా? లేదంటే వారానికో, 15 రోజుల కోసారి వచ్చి సంతకాలు చేసి జీతాలు తీసుకుంటున్నారా ? అనే విషయంలో కూడా అనేకసార్లు చర్చ జరిగినప్పటికీ వారిపై ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.దీంతో ప్రత్యేక కార్యాచరణ సిద్ధమవుతుంది.

ఉద్యోగుల హాజరుపై నెలవారీగా షీట్

నిజామాబాద్, వికారాబాద్ ప్రాంతంలో ఈ యాప్‌ను అందుబాటులోకి తెచ్చిన సాఫ్ట్‌వేర్ ఏజెన్సీని ఇప్పటికే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సంప్రదించారు. సంబంధిత ఏజెన్సీ యాప్‌ను ఇన్‌స్టాలేషన్ చేయడంతోపాటు జిల్లాలో శిక్షణా తరగతులు కూడా నిర్వహించనున్నారు. ఈ వారంలోనే కార్యక్రమాన్ని పూర్తి చేయనున్నారు. ప్రతీనెల ఓ ఉద్యోగిపై వేయాల్సి ఉంటుంది. కొంతమంది మెడికల్ ఆఫీసర్లు ఆయా మండలంలో జనరల్ బాడీ సమావేశానికి వెళ్లినట్లయితే, అందుకు సంబంధించిన టైం కూడా నమోదు చేయాల్సి ఉంటుంది.

తాము పనిచేసే ప్రాంతం పరిధి దాటినట్లయితే ఈ యాప్ ద్వారా గుర్తించే వీలుటుందని తెలుస్తుంది. ఇక సిబ్బంది, ఉద్యోగులు, డాక్టర్లు పనితీరుకు సంబంధించి ఈ యాప్ ద్వారా నెలవారీగా షీట్ తీసుకుని అందులో వారి పనితీరు తేడా ఉంటే శాఖపరమైన చర్యలు తీసుకునే అవకాశం అధికంగా ఉంటాయి. ఈయాప్ రూపొందిన అనంతరం మానిటరింగ్ కోసం ప్రత్యేకంగా ఓ బృందాన్ని నియమించనున్నట్లు వినికిడి. అయితే ఈనెలలో ఉద్యోగులు, అధికారులు బదిలీ అవుతుండటంతో ఈ యాప్‌ను ఇప్పటికి ఇప్పుడే అమలు చేస్తారా? లేదంటే బదిలీలు పూర్తయిన తర్వాత అమల్లోకి తీసుకొస్తారా? అనేది వేచి చూడాల్సి ఉంది.

ఈ యాప్ నిర్వహణకోసం రూ.25 వరకు ఖర్చయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. యాప్ ఇన్‌స్టాలేషన్ కూడా రూ.30వేల వరకు ఖర్చవుతుందని తెలుస్తుంది. ఇకపోతే ఉద్యోగులు, సిబ్బంది, డాక్టర్లు తాము పనిచేసే పీహెచ్‌సీ పరిధిలో ఉన్నారా? లేక ఇతర ప్రాంతానికి వెళ్లారా? అనేది కూడా ఈ యాప్ పసికట్టే అవకాశం ఉంటుంది. ఈ యాప్ అమల్లోకి వస్తే సమయానికి వస్తున్నారా? ఆలస్యంగా వస్తున్నారా? వచ్చిన సమయంతోపాటు తిరిగి వెళ్లే సమయం కూడా అటెండెన్స్ ఈ యాప్ ద్వారా

ఇప్పటికే వికారాబాద్, నిజామాబాద్‌లలో...

నల్లగొండ జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి పనిచేసిన ప్రాంతాల్లో ఈ విధానం అమల్లోకి తెచ్చారు. నిజామాబాద్‌లో కలెక్టర్‌గా పనిచేసిన సమయంలో నారాయణరెడ్డి వైద్య ఆరోగ్యశాఖలో ఈ ప్రత్యేక యాప్‌ను అమల్లోకి వచ్చేలా చేశారు. అదేవిధంగా వికారాబాద్‌లో కూడా అమల్లోకి వచ్చింది. ఈ రెండు ప్రాంతాల్లోనూ ఈ యాప్ ద్వారా అనేక మార్పులు రావడంతో వైద్య ఆరోగ్యశాఖ పటిష్ఠమైనట్లు సమాచారం. ఏఎన్ఎంలు మొదలుకుని డాక్టర్ల వరకు విధులకు హాజరై ప్రజలు, రోగులకు ఖచ్చితమైన సేవలు అందించడం కోసం ఈ యాప్ ద్వారా ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగడానికి జిల్లా ఆరోగ్యశాఖ కసరత్తులు చేస్తుంది. డాక్టర్ల నుంచి మొదలుకుని అధికారులు, ఉద్యోగులు సెలవు రోజులు, సెలవు పెట్టిన మినహా మిగతా రోజుల్లో అటెండెన్స్ తప్పనిసరిగా ఈ యాప్‌లో నమోదు కావాల్సిందే.

కచ్చితమైన హాజరు కోసం యాప్



పీహెచ్‌సీలు, ఆస్పత్రులకు ఏఎన్ఎంల నుంచి డాక్టర్ల వరకు కచ్చితంగా విధులకు హాజరయ్యే విషయంతో పాటు హాజరు కచ్చితంగా ఉండే విధంగా కొద్దిరోజుల్లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో ప్రత్యేక యాప్ రూపొందించనున్నాం. నల్లగొండ కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు ఈ యాప్‌ను అమల్లోకి తీసుకువస్తున్నాం. రోగులకు మెరుగైన సేవలతో పాటు శాఖపరంగా ప్రజలకు సేవలందించడం కోసం ఈ యాప్ ఎంతో ఉపయోగపడుతుంది.

- డా.కల్యాణ చక్రవర్తి, డీఎంహెచ్‌వో, నల్లగొండ

జీవో 10ని రద్దు చేయాలి

అంగన్‌వాడీ టీచర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి



అంగన్‌వాడీల ధర్నాలో మాట్లాడుతున్న జయలక్ష్మి

నల్లగొండ టౌన్, జూలై 6: అంగన్‌వాడీ ఉద్యోగులకు 65 ఏళ్లు పూర్తికాగానే అతి తక్కువ రిటైర్మెంట్ బెనిఫిట్ ఇస్తూ ఇంటికి పంపేలా ఉన్న జీవో 10ని వెంటనే రద్దు చేయాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు శనివారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన మహా ధర్నాలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచాలని 2013లో రాష్ట్రంలో 24 రోజులు నిరవధిక సమ్మె నిర్వహించామన్నారు. సమ్మె విరమణ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్లకు రూ.2లక్షలు, హెల్పర్లకు రూ.1లక్ష రిటైర్మెంట్ బెనిఫిట్ పెంచుతామని, పెన్షన్ వీఆర్ఎస్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చిందన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, నాటి సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని మంత్రి సీతక్క, ఉన్నతాధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లామన్నారు. అయితే గత ప్రభుత్వం జారీచేసిన జీవో 10ను కాంగ్రెస్ ప్రభుత్వం ఏకపక్షంగా అమలు చేయాలని సర్క్యులర్ జారీ చేయడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా, జీవో అమలుకు పూనుకోవడం తగదన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్ పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు తుమ్మల వీరారెడ్డి, చినపాక లక్ష్మీనారాయణ, దండెంపల్లి సత్తయ్య, చింతపల్లి బయన్న, పి.నాగమణి, బి.పార్వతి, కె.విజయలక్ష్మి, మన్నెమ్మ, పరిపూర్ణ, కే.రజిత, పాల్గొన్నారు.

ఎంజీయూలో

సెంటర్ ఫర్ ఎక్సలెన్స్

నల్లగొండ, జూలై 6: న్యూఢిల్లీకి చెందిన ఎడ్యూనెట్ ఫౌండేషన్, హైదరాబాద్ టాస్క్ సహకారంతో మహాత్మాగాంధీ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీలో సెంటర్ ఫర్ ఎక్సలెన్స్‌ను స్థాపించినట్టు సెంటర్ కోఆర్డినేటర్, ప్లేస్‌మెంట్ డైరెక్టర్ వై.ప్రశాంతి తెలిపారు. యూనివర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, రూ.30లక్షల వ్యయంతో 25 కంప్యూటర్లు, సర్వర్, ప్రొజెక్టర్‌ను ఏర్పాటు చేశామన్నారు.

అదేవిధంగా ఈ సెంటర్‌లో ఐదు రోజులపాటు ఫ్యాకల్టీకి డెవలప్‌మెంట్ ప్రోగ్రాంను నిర్వహించామన్నారు. 25మంది ఎంసీఏ, ఇంజనీరింగ్ అధ్యాపకులకు శిక్షణ ఇచ్చామని తెలిపారు. ఈ సెంటర్ ఎంజీయూతో మూడు సంవత్సరాల పాటు ఒప్పందం కుదుర్చుకుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంజీయూ రిజిస్ట్రార్ అల్వాల్ రవి, ప్రొఫెసర్ అంజిరెడ్డి, రేఖ, హరీష్, జయంతి, సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.



కాపలా కాసి దొంగని పట్టుకున్న రైతులు

గరిడేపల్లి, జూలై 6 : నిత్యం రైతుల కంటి మీద కునుకు లేకుండా విద్యుత్ మోటార్లు, వాటిలోని కేబుల్స్ వైర్లు దొంగతనం చేస్తున్న గ్యాంగ్‌లోని ఒకడిని రైతులు శుక్రవారం కాపుకాసి రైతులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. దొంగను పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం. వివరాల్లోకి వెళితే వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో గరిడేపల్లి మండలం కొత్తగూడెం, రంగాపురం, గరిడేపల్లి, అప్పన్నపేట, గడ్డిపల్లి, తాళ్లమల్కాపురం గ్రామాలకు చెందిన రైతులు బోర్లు, బావులకు మోటార్లకు అమర్చి వాటి ద్వారా నారుమడులు సాగు చేసి నీటిని వాడుకుంటున్నారు. జూన్ 19న వెలిదండ రోడ్డులోని రంగాపురం రైతువేదిక పక్కన ఆరు, కొత్తగూడెం, తాళ్లమల్కాపురం, కీతవారిగూడెం గ్రామాలతో పాటు మండలవ్యాప్తంగా సుమారు 50 మోటార్ల స్టాటర్ బాక్స్‌కు కేబుల్ వైర్లను, కొన్నిచోట్ల మోటార్లను పగులగొట్టి అందులోని కాపర్‌వైర్లను దొంగలు చోరీచేశారు. గరిడేపల్లి మండల కేంద్రంలోని తాళ్లవాగు వద్ద మూడు, కల్మలచెర్వు రోడ్డులో మూడు మోటార్లు, గడ్డిపల్లి, ఖుతుబ్‌షాపురం గ్రామశివార్లలో పలు మోటార్లు చోరీకి గురయ్యాయి. పోలీసులకు ఫిర్యాదు చేసినా చోరీలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో వానాకాలం సీజన్ ప్రారంభంకావడం వర్షాలు పడుతుండడంతో వేలకు వేలు ఖర్చుపెట్టి కొన్న మోటార్లు చోరీకి గురవుతుండటంతో రైతులు కాపాడుకోవాలని నిర్ణయించుకున్నారు. కొద్దిరోజులుగా మోటార్ల దొంగల కోసం కాపుకాస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం కొత్తగూడెం గ్రామాలకు చెందిన రైతుల మోటార్లను దొంగతనం చేస్తున్న మండలానికి చెందిన దొంగను పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఇదిలా ఉండగా గత ఏడాది వానాకాలం, యాసంగి సీజన్‌లో మిర్యాలగూడ, నిడమనూరు మండలాల నుంచి ఓ గ్యాంగ్ రాత్రి వేళల్లో వచ్చి దొంగతనాలకు పాల్పడితే రైతులు కాపాలా కాసి దొంగని పట్టుకొని పోలీసులకు అప్పగించి వారిని జైలుకు పంపారు. ఈ ఏడాది కూడా పోలీసులకంటే ముందే రైతులు దొంగను పట్టుకున్నారు.పట్టుకొన్న దొంగను పోలీసులు విచారించగా మరికొందరు ఉన్నట్లు సమాచారం. ఈ చోరీల్లో ఎంతమంది ఉన్నారనే అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది. దొంగ ఇచ్చిన సమాచారం మమేరకు శనివారం మరో నిందితుడిని పట్టుకురాగా మూత్రవిసర్జనకు వెళ్తున్నట్లు చెప్పి స్టేషన్ నుంచి పరారైనట్లు తెలుస్తోంది. అతడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ ఘటనపై ఎస్ఐ సైదులు వివరణ ఇస్తూ రైతులు పట్టించిన దొంగను విచారిస్తున్నామన్నారు. అనుమానితులను కూడా విచారిస్తున్నామన్నారు. కాగా పరారైన దొంగ విషయాన్ని పోలీసులు నిర్ధారించడం లేదు.



దొంగలు ధ్వంసం చేసిన మోటార్లు, దొంగతనానికి గురైన వైర్లు

గురుకుల బాలికలకు రక్షణ కల్పించాలి


అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

మిర్యాలగూడ టౌన్, జూలై 6: గురుకులాల్లో విద్యనభ్యసిస్తున్న బాలికలకు రక్షణ కల్పించాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. బీసీ విద్యార్థి సంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి జీడయ్యయాదవ్, మాల మహానాడు విద్యార్థి విభాగ జాతీయ ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సురేష్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గురుకులాల్లో అభ్యసిస్తున్న వేలాది మంది బాలికలు కనీసవసతులు, రక్షణ, పర్యవేక్షణ లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. వేధింపులు, అఘాయిత్యాలు, అరకొర వసతులు విద్యార్థుల పాలిటశాపంగా మారగా ప్రభుత్వం చోద్యం చూస్తోందన్నారు. రెండేళ్ల కాలంలో ఆయా విద్యాలయాల్లో విద్యార్థినులు మృత్యువాత పడ్డ సంఘటనలూ లేకపోలేదన్నారు. తాజాగా సూర్యాపేట జిల్లా బాలెంల సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థినులు ప్రిన్సిపాల్ వేధిస్తుండగా ఆ విషయాన్ని ఆర్‌సీవో దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోగా విద్యాలయం ఎదుట విద్యార్థినులు ధర్నా చేశారని గుర్తు చేశారు. సదరు ప్రిన్సిపాల్, ఆర్‌సీవోపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇక డిండిలో గురుకుల పాఠశాల విద్యార్థినులను ఎలుకలు గాయపరిచిన ఘటన ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గురుకులాలను ప్రభుత్వం పటిష్ఠం చేయాలని, విద్యార్థతో అనైతికంగా, నిర్లక్ష్యంగా ప్రవర్తించే అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో పాల్వాయి సుధాకర్, సయ్యద్ ఫారూఖ్, రవినాయక్, ప్రవీణ్,రాజు తదితరులు పాలొన్నారు.

విద్య, సంక్షేమం లక్ష్యంగా ముందుకు సాగాలి


నూతన బాధ్యులకు నియామకపత్రాలను అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు ఉషాకిరణ్

నల్లగొండ టౌన్, జూలై 6 : ఆదివాసీల హక్కులలో భాగంగా సంక్షేమం, విద్య, అభివృద్ధి, నాయకత్వాలే లక్ష్యాలుగా నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్(ఎన్‌టీఎఫ్) ముందుకు సాగుతుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వలువాయి ఉషాకిరణ్ అన్నారు. శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని పీఆర్‌టీయూ భవన్‌లో నిర్వహించిన ఎన్‌టీఎఫ్ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివాసీల హక్కులను కాపాడుతూ గడిచిన ఎనిమిదేళ్లలో ఎన్‌టీఎఫ్ ఎన్నో ఉద్యమాలు చేసిందన్నారు. ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ తమ పోరాటాలను గుర్తించి ఆదివాసి గిరిజనుల కోసం మూడు ప్రత్యేక కార్పొరేషన్లను ఏర్పాటుచేసిందన్నారు. అందులో ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటుచేయడం హర్షనీయమన్నారు. తాజాగా నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ నూతనంగా అన్ని జిల్లా శాఖలను ఏర్పాటు చేస్తున్నామని, అందులో భాగంగా జిల్లా నూతనకమిటీతో పాటు మండల బాధ్యులను ఎకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు. జిల్లా నూతన అధ్యక్షుడిగా రుద్రాక్షి మురళీ, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నెలకొండరాశి లింగస్వామి, ప్రధానకార్యదర్శిగా పిట్టల నాగరాజు, ఉపాధ్యక్షులుగా పిట్టల రామోజీ, కనగల్ మండల అధ్యక్షుడిగా నెలకొండరాశి శివరాజులతో పాటు వివిధ మండలాల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులను ఎన్నుకున్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వల్లభాయ్ తిరుపతి, సెక్రెటరీ శ్రీను, దేవరాయ సురేష్, తోకల రమేష్ పాల్గొన్నారు.

అత్తపై కోడలు దాడి

మోత్కూరు, జూలై 6 : యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మండలం రాగిబావి గ్రామంలో అత్తపై కోడలు దాడి చేసి గాయపర్చిన సంఘటన శనివారం జరిగింది. గ్రామస్థుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. అత్త బాసాని సత్తమ్మతో పెద్దకోడలు జ్యోతి తగదాపడింది. కోడలు కత్తితో దాడి చేసిందని కొందరు చెబుతుండగా, కర్రతో అత్తను కొట్టబోగా కుమారుడు కిష్టయ్య కర్రలాక్కునే ప్రయత్నంలో దానికి ఉన్న శిల సత్తమ్మ తగిలి గాయమైందని మరికొందరు పేర్కొంటున్నారు. కుమారుడు, కోడలు హైదరాబాద్‌లో ఉంటుండగా ఖాళీగా వారి ఇంట్లో సత్తమ్మ ఉంటోంది. తమ ఇంట్లో ఉండవద్దని ఇల్లు ఖాళీ చేయమని కోడలు ఆమెతో కొన్నిరోజులుగా గొడవ పడుతోంది. శనివారం వారు హైదరాబాద్ నుంచి వచ్చి సత్తమ్మతో గొడవ పడి కొట్టగా ఆమె గాయపడింది. ఆమెను ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు విచారణ జరుపుతున్నామని ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ

నూతనకల్, జూలై 6 : సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం చిల్పకుంట్ల గ్రామంలో నమోదైన అట్రాసిటీ కేసుపై సూర్యాపేట డీఎస్పీ రవి శనివారం గ్రామంలో విచారణ నిర్వహించారు. బత్తుల విజయలక్ష్మిని అదే గ్రామానికి చెందిన బిక్కి అనసూయ కులం పేరుతో దూషించినట్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సైదులు తెలిపారు.







అధికదిగుబడులు అభినందనీయం


వాకిటి రజితను సన్మానిస్తున్న మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు

చౌటుప్పల్ టౌన్, జూలై 6: వ్యవసాయ రంగంలో మహిళా రైతులు సేంద్రీయ ఎరువులతో అధిక దిగుబడులను సాధించి ప్రభుత్వ ప్రశంసలను పొందడం అభినందనీయమని యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. సేంద్రీయ ఎరువులతో అధిక దిగుబడులను సాధించి, ఉత్తమ రైతుఅవార్డును ప్రభుత్వం నుంచి అందుకున్న పెద్దకొండూరు గ్రామానికి చెందిన మహిళా రైతు వాకిటి రజితను చైర్మన్ రాజు శనివారం మునిసిపల్ కార్యాలయంలో సన్మానించారు. సాగు రంగంలో వస్తున్న మార్పుల కనుగుణంగా పంటల సాగు అధిక దిగుబడులను సాధిస్తున్న ఉత్తమ మహిళా రైతు రజితను చైర్మన్ అభినందించారు.

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నర్సింహ


నర్సింహకు నియామక పత్రం అందజేస్తున్న కృష్ణయ్య

మోత్కూరు, జూలై 6: బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు పట్టణానికి చెందిన గడ్డం నర్సింహను సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, రాష్ట్ర కోఆర్డినేటర్ ర్యాగా అరుణ్‌కుమార్ నియమించారు. ఈ మేరకు శనివారం వారు ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. అనంతరం నర్సింహ విలేకరులతో మాట్లాడుతూ బీసీలను సమీకరించి బీసీలకు చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్ల కోసం పోరాడుతానన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీలకతీతంగా బీసీ అభ్యర్థులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. తనను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించిన కృష్ణయ్య, అరుణ్‌కుమార్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి

దేవరకొండ, జూలై 6: జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం నల్లగొండ జిల్లా దేవరకొండ రహదారి బంగ్లాలో నూతనంగా ఎన్నికైన దేవరకొండ ప్రెస్‌క్లబ్ నూతన కమిటీని బీసీ సంక్షేమసంఘం ఆధ్వర్యంలో సన్మానించి, మాట్లాడారు. జర్నలిస్టులు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటు ప్రజాసమస్యలను వెలికితీస్తున్నారని అన్నారు. ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. సమాజ హితం కోసం వారిలో జర్నలిస్టులు మొదటి వరుసలో ఉంటారన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు చొల్లెటి భాస్కరచారి, రాసమళ్ల నారయ్య, కృష్ణమాచారి, బ్రహ్మాచారి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కర్నాకర్, జర్నలిస్టులు, నూతన కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నీటి అక్రమ తరలింపుపై చర్యలకు రంగం సిద్ధం

● మూసీనీటిని తరలిస్తున్న వారికి తొలుత నోటీసులు
● ఆ తర్వాత చట్టపరమైన చర్యలు

కేతేపల్లి, జూలై 6 : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నాగార్జునసాగర్ తర్వాత రెండో పెద్ద సాగునీటి వనరుగా ఉన్న మూసీ రిజర్వాయర్ నీటిని నాన్ ఆయకట్టుకు అక్రమంగా తరలించుకుపోతున్న వారిపై చర్యలు తీసుకునే దిశగా నీటిపారుదల శాఖ అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. మూసీ రిజర్వాయర్‌తో పాటు ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల నుంచి ఆయకట్టేతర భూములకు అక్రమ నీటి వినియోగం దశాబ్దకాలంగా కొనసాగుతోంది. అక్రమంగా నీటిని వినియోగిస్తున్న వారు స్వచ్ఛందంగా మోటార్లు తొలగించుకోవాలని సూచిస్తూ అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. మూసీ రిజర్వాయర్ నలుదిక్కులా విద్యుత్ పంపుసెట్లు ఏర్పాటుచేసి కిలోమీటర్ల మేర పైపులైన్లు వేసి నీటిని తరలించి వ్యవసాయం చేస్తున్నారు. ప్రాజెక్టు కుడి, ఎడమ ప్రధాన కాల్వలు, డిస్ట్రిబ్యూటరీలపై మోటార్లు ఏర్పాటు చేసి నీటిని ఆయకట్టేతర భూములకు తరలిస్తున్నారు. ఈ తతంగం దశాబ్దానికిపైగా కొనసాగుతుండడంతో మూసీ ఆయకట్టులో నిర్దేశించింది 40వేల ఎకరాలు అయితే అంతే విస్తీర్ణంలో నాన్‌ఆయకట్టులోని భూములకు నీటి సరఫరా జరుగుతోంది. దీంతో ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల చివరి ఆయకట్టు భూములకు సాగు నీరందని పరిస్థితి నెలకొంది.

హైకోర్టు ఆదేశాలతో చర్యలకు దిగిన అధికారులు

మూసీ రిజర్వాయర్‌తో పాటు ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల కట్టలపై విద్యుత్ పంపుసెట్లు పెట్టి నీటిని ఆయకట్టేతర భూములకు తరలించే కార్యక్రమం గత 2010నుంచి కొనసాగుతోంది. ప్రాజెక్టు చివరి ఆయకట్టు రైతులు ఆందోళన చేయడంతో 2012లో అప్పటి మూసీ అధికారులు పోలీసుల సాయంతో అక్రమంగా నీటిని తరలిస్తున్న విద్యుత్ మోటార్లను కొంతమేర తొలగించారు. అయితే నాటి రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో అధికారులు ఆ తర్వాత నీటి అక్రమ తరలింపు వ్యవహారాన్ని పట్టించుకోలేదు. దీంతో మూసీ కుడి, ఎడమ కాల్వల చివరి ఆయకట్టు ప్రాంత రైతులు తమకు అందాల్సిన సాగు నీటిని ఎగువ ప్రాంత నాన్‌ఆయకట్టు రైతాంగం అక్రమగా తరలించుకుపోతున్నారంటూ హైకోర్టును ఆశ్రయించారు. కేసు ఎటూ తేలకపోవడంతో నీటి అక్రమ తరలింపు వ్యవహారం కొనసాగుతూ వస్తోంది. మూసీ కుడి, ఎడమ కాల్వలపై గల రిజర్వుడు చెరువులు, కుంటల నుంచి దాదాపు 5 కిలోమీటర్ల మేర పైప్‌లైన్లు ఏర్పాటు చేసి భారీ విద్యుత్ పంపుసెట్లతో నీటిని తరలిస్తున్నారు. ఇలా



మూసీ రిజర్వాయర్, కాసనగోడు శివారులో మూసీ కుడి ప్రధాన కాల్వ కట్టపైన నీటిని తరలించేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్లు(ఫైల్ ఫొటో)

తరలించే పంపుసెట్లకు విద్యుత్ సరఫరా చేసేందుకు ట్రాన్స్‌కో యంత్రాంగం కాల్వ కట్టలపై విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను సైతం ఏర్పాటు చేసిందంటే వ్యవహారం ఏ స్థాయిలో జరుగుతుందో తెలుస్తోంది. ఈ క్రమంలో 2012లో టేలాండ్ రైతులు హైకోర్టులో వేసిన కేసు ఇటీవల విచారణకు రావడం అక్రమంగా నీటిని తరలిస్తున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలంటూ కోర్టు ఆదేశించడంతో తప్పనిసరి పరిస్థితుల్లో నీటిపారుదల శాఖ అధికారులు రంగంలోకి దిగారు. మూసీ రిజర్వాయర్, ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలపై పంపుసెట్లు ఏర్పాటుచేసిన వారిని గుర్తించి సదరు పంపుసెట్లను స్వచ్ఛందంగా తీసి వేయాలని వారం రోజులుగా పలువురు రైతులకు నోటీసులు అందజేస్తున్నారు.

మూడు నెలలు గడువు

మూసీ రిజర్వాయర్ చుట్టూ, కాల్వలపైన మోటార్లు పెట్టి సాగునీటిని అక్రమంగా తరలిస్తున్న వారు తమ విద్యుత్ పంపుసెట్లను స్వచ్ఛందంగా తొలగించుకోవడానికి గరిష్ఠంగా మూడు నెల గడువు ఇస్తున్నట్లు తెలిసింది. ఈ మేరకు నీటిని తరలించే రైతులకు అందించే నోటీసుల్లో అధికారులు సూచిస్తున్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు మూడు నెలల్లో మోటార్లను తొలగించకుంటే మోటార్లను స్వాధీనం చేసుకోవడంతో పాటు వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆ నోటీసుల్లో అధికారులు పేర్కొంటున్నట్లు సమాచారం.

1000కి పైగా అక్రమ పంపుసెట్ల గుర్తింపు

హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో మూసీ రిజర్వాయర్ పరిసరాలతో పాటు ప్రాజెక్టు కుడి, ఎడమ ప్రధాన కాల్వలు, డిస్ట్రిబ్యూటరీ కాల్వలపై 1000కి పైగా అక్రమ విద్యుత్ పంపుసెట్లు ఉన్నట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం. వీరందరికీ నోటీసులు సిద్ధం చేసిన మూసీ అధికారులు తొలుత మూసీ కుడి,ఎడమ ప్రధాన కాల్వలు, డిస్ట్రిబ్యూటరీ కాల్వలపై అక్రమంగా మోటార్లు అమర్చి ఆయకట్టేతర భూములకు నీటిని తరలిస్తున్న వారికి నోటీసులు పంపిణీ చేస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఈ నోటీసుల పంపిణీ చివరి దశకు వచ్చినట్లు సమాచారం. ఈ నోటీసుల పంపిణీ పూర్తికాగానే మూసీ రిజర్వాయర్ విస్తరించి ఉన్న వివిధ మండలాల్లోని గ్రామాల్లో పంపుసెట్లు ఏర్పాటు చేసిన వారికి నోటీసులు ఇవ్వనున్నట్లు ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు పేర్కొంటున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి



గుర్వమ్మ(ఫైల్)

పెన్‌పహాడ్, జూలై 6 : బైక్‌పై నుంచి కింద పడిన వృద్ధురాలు చెరుకుపల్లి గుర్వమ్మ(72) చికిత్సపొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందిందని సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ ఏఎస్ఐ వెంకటరత్నం తెలిపారు. సూర్యాపేట మండలం పిల్లలమర్రి గ్రామానికి చెందిన చెరుకుపల్లి గుర్వమ్మ పెన్‌పహాడ్ మండలం నాగులపహాడ్ గ్రామంలో ఉన్న చెల్లెలు లక్ష్మి ఇంటికి వెళ్లేందుకు లక్ష్మి కుమారుడు ఒగ్గు అశోక్ బైక్‌పై జూన్ 25న రాత్రి బయలు దేరింది. అనంతరం గ్రామ సమీపంలో మూలమలుపు వద్ద గేదెలు అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి గుర్వమ్మ కిందపడిపోయింది. గుర్వమ్మ తలకు తీవ్ర గాయాలు కావడంతో ఆమెను బంధువులు చికిత్స కోసం సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందింది. ఆమె భర్త 2013లో మృతి చెందగా, వీరికి పిల్లలు లేరు. లక్ష్మి కుమారుడు ఒగ్గు సతీష్‌ను సాదుకుంటోంది. గుర్వమ్మ మేనల్లుడు మామిడి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తి...



సత్తయ్య(ఫైల్)

నూతన్‌కల్, జూలై 6: బైక్ అదుపు తప్పి రోడ్డు పక్క ఇనుప రేయిలింగ్‌ను ఢీకొట్టి వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం ఎర్రపహాడ్ గ్రామశివారులో శనివారం జరిగింది. ఎస్ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పెదనేమిల గ్రామానికి చెందిన తన్నీరు సత్తయ్య(40) తన కుమార్తె సూర్యాపేటలోని ఆసుపత్రిలో ప్రసవించింది. మనవడు పుట్టడంతో రాత్రి అక్కడే ఉండి తెల్లవారుజామున నాలుగు గంటలకు తన స్వగ్రామం పెదనేమిలకు బైక్‌పై వస్తుండగా అదుపు తప్పి రోడ్ ప్రక్కన ఉన్న ఇనుప రేయిలింగ్ రాడ్లకు బలంగా ఢీకొన్నాడు. దీంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సత్తయ్య భార్య ఉమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తికి తరలించారు.సత్తయ్యకు భార్యతో పాటు కుమార్తె, కుమారుడు ఉన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కోదాడటౌన్, జూలై 6 : సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని దుర్గాపురం సమీపంలోని ఖాళీస్థలంలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ రంజిత్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుర్తుతెలియని 70 ఏళ్ల వయస్సు గల వృద్ధుడిగా భావిస్తున్నట్లు తెలిపారు. తెల్లటి చొక్కా ధరించి కళ్ళజోడు పెట్టుకొని ఉన్నాడని, మృతుడికి సంబంధించిన వారు ఉంటే కోదాడ పట్టణ పోలీస్‌స్టేషన్లో సంప్రదించాలని ఎస్ఐ రంజిత్‌రెడ్డి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

నృసింహుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు

భువనగిరి అర్బన్, జూలై 6 : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి దివ్యక్షేత్రంలో శనివారం శాస్త్రోక్తంగా నిత్యపూజలు జరిగాయి. సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపిన అర్చకస్వాములు గర్భగుడిలో కొలువు దీరిన స్వయంభువులను, సువర్ణప్రతిష్టామూర్తులను వేదమంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకించి తులసీదళాలతో అర్చించారు. ప్రాకార మండపంలో సుదర్శన హోమం, నిత్యకల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో వైభవంగా చేపట్టారు. అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి అమ్మవార్లను ముగ్ధమనోహరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించిన అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్యతిరుకల్యాణోత్సవాన్ని ఆగమశాస్త్రరీతిలో చేపట్టారు. సాయంత్రం ప్రధానాలయ ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు సాయంత్రం అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో నిత్యకైంకర్యాలు వేదమంత్రాలు మంగళవాయిద్యాల నడుమ వైభవంగా నిర్వహించారు. ఈ ఆలయాల్లో సాయంత్రం వెండిజోడు సేవలు, సహస్రనామార్చనలు శాస్త్రోక్తంగా జరిగాయి. కొండపైన శివాలయంలో శ్రీ పర్వతవర్ధిని సమేతా రామలింగేశ్వరస్వామికి మహామండపంలో స్పటికమూర్తులకు నిత్యారాధనలు, యాగశాలలో నిత్య రుద్ర హవన పూజలు శైవాగమ పద్ధతిలో కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 22,23,112 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు. కాగా, ఇందిరా భక్తి సంగీత కార్యక్రమం నిర్వహించారు.



ప్రాకార మండపంలో నిత్య కల్యాణోత్సవం నిర్వహిస్తున్న పూజారులు

రేషన్‌బియ్యం పట్టివేతలో నేరేడుచర్ల డీలర్ల పాత్ర

నేరేడుచర్ల, జూలై 6: నల్లగొండ జిల్లా దామరచర్ల మండలంలో 22 టన్నుల రేషన్ బియ్యం శుక్రవారం పట్టుబడటంతో సూర్యాపేట జిల్లా సివిల్‌సప్లయ్ అధికారులు జిల్లాలో ప్రత్యేక నిఘా పెట్టారు. నేరేడుచర్ల మండలంలోని ముగ్గురు డీలర్ల పాత్ర ఉందని తేలడంతో నేరేడుచర్ల మండలం చుట్టూ రేషన్ బియ్యం ఉచ్చు బిగుస్తోంది. మండలంలోని మేడారం డీలర్ కర్నాం పాండయ్యపై ఇప్పటికే కేసు నమోదు చేయగా, బక్కయ్యగూడెం, పెంచికల్‌దిన్న డీలర్లు కోన సత్యం, మిట్ట రాజేశ్వరినరేష్‌లను అదుపులోకి తీసుకొని దామరచర్ల పోలీసులు విచారణ చేపట్టినట్లు సమాచారం. హుజూర్‌నగర్ గోదాం నుంచి నేరుగా వాడపల్లి చెక్‌పోస్టు దాటించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు జిల్లాలో రేషన్ బియ్యం విక్రయించేందుకు 22 టన్నులతో బయలు దేరిన లారీ దామరచర్ల మండలం వాడపల్లి పోలీసులకు చిక్కింది. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా కర్నాం పాండయ్య పాత్ర బయటపడడంతో ఆయన్ను అరెస్టు చేసి కేసు నమోదుచేశారు. అనంతరం మరో ఇద్దరు డీలర్ల పాత్ర ఉందని తేలడంతో విచారణ చేపట్టారు. మేడారం డీలర్ పాండయ్యకు స్టాక్ కేటాయించినప్పటికీ రేషన్ తీసుకురాలేదు. దీంతో మేడారం గ్రామానికి విచారణకు వెళ్లిన సివిల్ సప్లయ్ అధికారులు స్టాక్ లేదని రిపోర్టు ఇచ్చారు. దీంతో 22 టన్నుల బియ్యం ఎక్కడికి పోవాల్సి ఉండగా ఎక్కడికి పోతున్నాయనే దానిపై సూర్యాపేట జిల్లా సివిల్ సప్లయ్ అధికారులు దృష్టి సారించారు. రేషన్ బియ్యం గత ప్రభుత్వ హయాంలో కూడా ఇదే విధంగా విక్రయించినప్పటికీ బయటపడలేదు. దీంతో ఇప్పుడు పూర్తిస్థాయి నిఘా పెట్టడంతో దారి తప్పే బియ్యం పట్టుబడుతున్నాయి. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకునేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. గోదాం నుంచి నేరుగా ఏపీకి రేషన్ బియ్యం తరలుతుండటంపై అధికారుల పాత్ర కూడా ఉందన్న అనుమానాలున్నాయి. ఇప్పటికే గతంలో ఇక్కడ పనిచేసిన అధికారులపై విచారణ చేపట్టే అవకాశం ఉన్నట్లు సమాచారం. డీలర్ల వద్ద మిగిలిన రేషన్ బియ్యాన్ని లబ్ధిదారులకు ఇవ్వకుండా అంతో ఇంతో వారికి ముట్ట చెప్పి డీలర్లు కొందరు విక్రయాలు సాగించేవారు. చిన్నచిన్న వాహనాల్లో కొనుగోలు చేసిన రేషన్ బియ్యాన్ని కొందరు బయట ప్రాంతాలకు విక్రయించారు. ఇప్పుడు ఏకంగా గోదాం నుంచి లారీ లోడుతో 22టన్నుల రేషన్ బియ్యం వెళ్లడంపై పెద్దఎత్తున అవినీతి జరిగి ఉందనే చర్చ సాగుతోంది. ఉన్నతాధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేపడితే అసలు దొంగలు దొరికే ఉంది.

విచారణ చేపడుతున్నాం : రాజశేఖర్, డీటీ, సివిల్ సప్లయ్ హుజూర్‌నగర్

రేషన్ బియ్యం 22 టన్నులు పట్టుబడిన విషయం తమకు సమాచారం పత్రికల ద్వారా తెలిసింది. మేడారం డీలర్ పాండయ్యకు సంబంధించిన స్టాక్ పరిశీలించాం. ఈ నెల స్టాక్ తీసుకురాలేదు. దీంతో అతడి షాపులో స్టాక్ లేదు. పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నాం. పోలీసు కేసు నమోదైనట్లు తెలిసి, ఎఫ్ఐఆర్ అందితే అతడిపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది. పెంచికల్‌దిన్న, బక్కయ్యగూడెం రేషన్‌డీలర్లను అదుపులోకి తీసుకున్న విషయం తెలియదు.

నలుగురు బైండోవర్

నేరేడుచర్ల మండలంలో రేషన్ బియ్యం కొనుగోలు చేసి పట్టుబడ్డ నేరస్తులను నలుగురిని బైండోవర్ చేసినట్లు నేరేడుచర్ల ఎస్ఐ రవీంద్రనాయక్ తెలిపారు. గతంలో నేరేడుచర్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో 9 మంది రేషన్ బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నామని అందులో మిర్యాలగూడకు చెందిన మేషవరపు కృష్ణ, పులగంబండ తండాకు చెందిన బాణోతు నాగు, బాణోతు ఉపేందర్, హుజూర్‌నగర్‌కు చెందిన కావలి ముసలి లను పిలిపించి నేరం చేయకుండా ఉండేందుకు ముందస్తుగా తహసీల్దార్ వద్ద బైండోవర్ చేసినట్లు తెలిపారు.

హుజూర్‌నగర్ గోదాం ఇన్‌చార్జి సస్పెన్షన్

హుజూర్‌నగర్, జూలై 6 : హుజూర్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ పౌరసరఫరాల గోదాం ఇన్‌చార్జి షేక్ నబీని సూర్యాపేట జిల్లా అదనపు కలెక్టర్ బీ లత సస్పెండ్ చేశారు. నల్లగొండ జిల్లా దామరచర్ల వద్ద రెండు రోజుల కిందట 22 టన్నుల రేషన్ బియ్యం పోలీసులు పట్టుకుని విచారణ చేపట్టారు. ఆ బియ్యం హుజూర్‌నగర్ గోదాంకు చెందినది అనుమానంతో డీఎస్‌వో మోహన్‌తో శనివారం విచారణ చేపట్టారు. విచారణలో 424 క్వింటాళ్ల బియ్యం నిల్వలో తేడా ఉండటంతో అదనపు కలెక్టర్ లత గోదాం ఇన్‌చార్జి షేక్‌నబీని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పూర్తి నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు.

ప్రిన్సిపాల్ రూంలో బీరు బాటిళ్లు

సూర్యాపేట రూరల్, జూలై 6: సూర్యాపేట జిల్లా కేంద్ర సమీపం బాలెంలలోని సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గదిలో బీరు బాటిళ్ల కలకలం రేపాయి. ఈ నెల 4వ తేదీన ప్రిన్సిపాల్ శైలజ వేధింపులకు నిరసనగా ఆమెను సస్పెండ్ చేయాలని 400 మంది విద్యార్థినులు రాస్తారోకో చేశారు. ఈ నేపథ్యంలో ప్రిన్సిపాల్ గది నుంచి కేర్‌టేకర్ సౌమిత్రి శుక్రవారం సాయంత్రం 6.30 గంటల సమయంలో సంచిలో కొన్ని వస్తువులను తరలిస్తుండగా, విద్యార్థినులు అడ్డుకున్నారు. ప్రిన్సిపాల్ గది నుంచి బ్యాగ్‌ను ఎందుకు తీసుకెళ్తున్నావు, అందులో ఏముందో చూపించాలని ఆమెతో వాగ్వాదం చేశారు. 'నా ఇష్టం నేను ఏమైనా తీసుకెళ్తా, ప్రిన్సిపాల్ శైలజ మేడమ్ తీసుకురమ్మంది, మీకు చెప్పాల్సిన అవసరం లేదని' కేర్‌టేకర్ సౌమిత్రి విద్యార్థినులతో అసభ్యపదజాలంతో దూషించింది. దీంతో విద్యార్థినులు బ్యాగును కేర్‌టేకర్ నుంచి బలవంతంగా లాక్కొని చూశారు. అందులో నాలుగు బీరు బాటిళ్లు ఉండటంతో విద్యార్థినులు అవాక్కయ్యారు. దీంతో మహిళా డిగ్రీ కళాశాల్లోకి బీరు బాటిళ్లు ఎలా వచ్చాయని కేర్‌టేకర్‌ను నిలదీసి ఆ బ్యాగును లాక్కొని ప్రిన్సిపాల్ గదిలో పెట్టి తాళం వేశారు.

విద్యార్థినుల ఆందోళన

ఈ నెల 4న కళాశాల ప్రిన్సిపాల్ శైలజ తీరును నిరసిస్తూ ఆందోళన జరగడం, ఈ నెల 5న బీరుబాటిళ్ల దర్శనమివ్వడంతో విద్యార్థినులు శనివారం కళాశాల ఎదుట ఆందోళనకు దిగారు. ప్రిన్సిపాల్ శైలజ తరుచూ మద్యం సేవిస్తూ వేధింపులకు గురిచేస్తోందని, కళాశాలల్లో సమస్యలపై ప్రశ్నిస్తే సిబ్బందితో కలిసి ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సహాయ కేర్‌టేకర్ సౌమిత్రితో కలిసి అర్ధరాత్రి వేళ మద్యం సేవిస్తూ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రిన్సిపాల్ కార్యాలయంలో మద్యం సీసాలు కనపడడం ఏంటని విద్యార్థులు ప్రశ్నించారు. ప్రిన్సిపాల్ శైలజ కుమారుడు వచ్చి వారం రోజుల పాటు కళాశాల్లో ఉంటాడని, మహిళా కళాశాల్లో ఎలా ఉంటారని విద్యార్థినులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని ఆందోళనలు చేసినా అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదని వాపోయారు. తక్షణమే గురుకులాల సెక్రటరీ వచ్చి ప్రిన్సిపాల్‌పై విచారణ చేసి విధుల నుంచి తొలగించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు కళాశాల ఆవరణలోనే ఆందోళన చేశారు.



విద్యార్థినులను విచారిస్తున్న అధికారులు, పోలీసులు

మద్యం బాటిళ్లను చూపిస్తున్న విద్యార్థినులు

కళాశాలను పరిశీలించిన జిల్లా ఉన్నతాధికారులు

బాలెంల గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ఎదుట విద్యార్థినులు పెద్ద సంఖ్యలో ఆందోళన చేస్తున్నారనే విషయం తెలుసుకున్న సూర్యాపేట ఆర్డీవో వేణుమాదవరావు, కళాశాలల ఆర్‌సీవో అరుణకుమారి, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి జ్యోతి, డీఎస్పీ రవికుమార్, సీఐ రాజశేఖర్, రూరల్ ఎస్ఐ బాలునాయక్ కలిసి కళాశాలకు చేరుకొని విద్యార్థినులతో వాస్తవాలను విచారించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విచారణ నివేదికను ఉన్నతాధికారులకు పంపించి వారి నిర్ణయం మేరకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అయినా విద్యార్థినులు ఆందోళన విరమించేదిలేదంటూ తరుచూ ఇలాంటి వేధింపులు జరుగుతున్నాయని ముందు సస్పెండ్ చేసిన తర్వాతే విచారణ చేయాలని డిమాండ్ చేశారు. దీంతో కళాశాల్లో మద్యం సీసాల కలకలం, వరుస ఆందోళనలు నేపథ్యంలో మరోసారి అధికారులు విద్యార్థినులతో మంతనాలు జరిపి ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకుంటామని, ప్రిన్సిపాల్ శైలజను సస్పెండ్ చేస్తామని, ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చూసుకుంటామని హామీ ఇవ్వడంతో విద్యార్థినులు ఆందోళన విరమించారు. ఇదిలా ఉండగా కళాశాలలో వరుస సంఘటనలతో విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కళాశాలలో బీరు బాటిళ్ల లభ్యం అవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

బాలెంల ఘటనపై చర్యలు చేపట్టండి : మంత్రి ఉత్తమ్

సూర్యాపేట(కలెక్టరేట్) / సూర్యాపేట రూరల్: బాలెంలలోని సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో వరుసగా విద్యార్థుల ఆందోళన, ప్రిన్సిపాల్ గదిలో బీరు సీసాల కలకలంపై మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పందించారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరపాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌ను ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు పూర్తిస్థాయి విచారణ కమిటీ అధికారిగా అదనపు కలెక్టర్ బీఎస్ లత, కమిటీ సభ్యులుగా డిప్యూటీ సీఈవో శిరీష, సూర్యాపేట ఆర్డీవో వేణుమాధవ్, ఎస్సీ అభివృద్ధి అధికారి లతను నియమిస్తున్నట్లు కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు. ఈ ఘటనపై విచారణ నివేదిక త్వరగా అందించాలని ఆదేశించారు.

నారమ్మగూడెం వాసి అజయ్‌కుమార్‌కు డాక్టరేట్



నిడమనూరు, జూలై 6: నల్లగొండ జిల్లా మండలంలోని నారమ్మగూడెం గ్రామానికి చెందిన శివర్ల అజయ్‌కుమార్‌కు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. హైదరాబాద్‌లోని బడంగ్‌పేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల(మహిళ)లో ఇంగ్లీష్ లెక్చరర్‌గా అజయ్ విధులు నిర్వహిస్తున్నారు. ఆంగ్ల ప్రొఫెసర్ వైఎల్ శ్రీనివాస్ పర్యవేక్షణలో 'మార్కెటింగ్ మైథాలజీ ఏ స్టడీ ఆఫ్ ది మైథలాజికల్ వర్క్స్ ఆఫ్ అమిష్ త్రిపాఠి, ఆనంద్ నీలకంఠన్ అండ్ దేవదత్ పట్నాయక్ అనే అంశంపై పరిశోధన చేసినందుకు ఉస్మానియా యూనివర్సిటీ అజయ్‌కు డాక్టరేట్ ప్రధానం చేసింది. కాగా డాక్టరేట్ పొందిన అజయ్‌ను కళాశాల ప్రిన్సిపాల్ భవానీ, హెచ్‌వోడీ డాక్టర్ రాహుల్, సహోద్యోగులు, గ్రామస్థులు శుభాకాంక్షలు తెలిపారు.

గుట్ట డిపో నుంచి అరుణాచలానికి బస్సు

మోత్కూరు, జూలై 6 : యాదగిరిగుట్ట ఆర్టీసీ బస్సు డిపో నుంచి తమిళనాడు రాష్ట్రంలోని అరుణాచల గిరిప్రదక్షణకు ప్రత్యేక బస్సు సర్వీసు నడపనున్నామని భక్తులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని యాదగిరిగుట్ట డిపో మేనేజర్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. సూపర్ లగ్జరీ బస్సు ఈ నెల 19 రాత్రి 8 గంటలకు బయలుదేరి కాణిపాకం, శ్రీపురం గోల్డెన్ టెంపుల్ మీదుగా అరుణాచలం వెళుతుందని, ఈ నెల 21న పౌర్ణమి రోజు అరుణాచల గిరిప్రదక్షణ పూర్తయిన అనంతరం సాయంత్రం 5గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 22న ఉదయం 8 గంటలకు యాదగిరిగుట్ట చేరుకుంటుందన్నారు. పెద్దలకు రూ.4వేలు, పిల్లలకు రూ.2 వేల చార్జీ ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 9885103165, 7382836203 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

సాంకేతిక లోపంతో ఆగిన రైలు చక్రాలు

● రెండు గంటలు నిలిచిన ఫలక్‌నామా ఎక్స్‌ప్రెస్ ● ఇబ్బందులు పడిన ప్రయాణికులు



మరమ్మతులు చేస్తుండగా వేచి చూస్తున్న ప్రయాణికులు, ట్రైన్ వీల్స్‌ను పరిశీలిస్తున్న నిపుణులు

మిర్యాలగూడ టౌన్, జూలై 6: సాంకేతిక లోపంతో రైలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో జరిగింది. అధికారులు, ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం 8.40 గంటలకు హౌరా జంక్షన్ నుంచి సికింద్రాబాద్‌కు బయలుదేరిన సింహపురి-ఫలక్‌నామా ఎక్స్‌ప్రెస్ రైలు(12703) సాంకేతిక లోపంతో మిర్యాలగూడలో శనివారం నిలిచిపోయింది. ట్రైన్ వీల్‌లో కలిగిన అంతరాయం కారణంగా రైలును నిలిపివేసినట్టు అధికారులు తెలిపారు. ఉదయం 7.55గంటలకు మిర్యాలగూడ స్టేషన్ చేరుకున్న తర్వాత సమస్యను గుర్తించిన పైలెట్ రైలును స్టేషన్‌లోనే నిలిపివేశాడు. అనంతరం విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేయడంతో హుటాహుటిన సికింద్రాబాద్ నుంచి మిర్యాలగూడకు వచ్చిన రైల్వేశాఖ సాంకేతిక నిపుణులు మరమ్మతులు చేపట్టారు. దీంతో మిర్యాలగూడ రైల్వే స్టేషన్ నుంచి ఉదయం 9.55గంటలకు సికింద్రాబాద్ వైపునకు రైలు బయలుదేరింది. అయితే సాంకేతిక లోపాన్ని పసిగట్టిన ఇంజిన్ డ్రైవర్, రైలును స్టేషన్‌లోనే నిలిపివేయడంతో ప్రమాదం తప్పిందని, ఈ రూట్లో వెళ్లే ఇతర రైళ్లకు ఎలాంటి అంతరాయం కలగలేదని స్టేషన్ మాస్టర్ తారకేశ్వరరావు తెలిపారు.

సింగపూర్‌లో కోదాడ యువకుడు మృతి

● టోసా బీచ్ వద్ద మృతదేహం లభ్యం



పవన్ (ఫైల్), కోదాడ పట్టణంలో రోదిస్తున్న పవన్ తల్లిదండ్రులు

కోదాడటౌన్, జూలై 6: సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణానికి చెందిన యువకుడు సింగపూర్‌లో అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. కోదాడ పట్టణానికి చెందిన, పల్లీ వ్యాపారి చౌడవరపు శ్రీనివాసరావు, చంద్రకళ దంపతుల రెండో కుమారుడు పవన్(28) సంవత్సరంన్నరగా సింగపూర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. సింగపూర్‌లో ఉద్యోగం చేస్తూనే అమెరికా వెళ్లే ప్రయత్నాల్లో ఉన్నాడు. ఈ నేపథ్యంలో సింగపూర్‌లోని సెయింట్ టోసా బీచ్ వద్ద శుక్రవారం ఉదయం పవన్ మృతదేహాన్ని గుర్తించిన అక్కడి పోలీసులు అతని జేబులో ఉన్న గుర్తింపు కార్డు ఆధారంగా పవన్ సోదరుడు లండన్‌లో ఉద్యోగం చేస్తున్న హరికృష్ణకు ఫోన్ చేసి విషయాన్ని చెప్పారు. కాగా, తమ్ముడు మృతిచెందిన విషయాన్ని పెద్దకుమారుడు హరికృష్ణ శుక్రవారం సాయంత్రం తమకు ఫోన్లో చెప్పాడని తల్లిదండ్రులు తెలిపారు. అంతా బాగానే ఉందని గురువారం సాయంత్రం పవన్ తమతో మాట్లాడిన మాటలు చివరి మాటలయ్యాయిని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. పవన్ మృతదేహాన్ని కోదాడకు తెప్పించేందుకు తల్లిదండ్రులు, అధికారులు ప్రయత్నిస్తున్నారు. పవన్ మృతితో కోదాడలో విషాదచాయలు అలుముకున్నాయి. పవన్ అవివాహితుడు.

హోటల్స్, మద్యం దుకాణాలపై దాడులు



నమూనాలు సేకరిస్తున్న అధికారులు

నల్లగొండ రూరల్, జూలై 6 : నల్లగొండ జిల్లా కేంద్రంలోని పలు వైన్స్‌షాపులు, హోటళ్లపై శనివారం జోనల్ ఫుడ్ కంట్రోలర్ వీ జ్యోతిర్మయి, నల్లగొండ ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ పీ స్వాతితో కలిసి ఆకస్మిక దాడులు జరిపారు. దాడుల్లో వైన్స్‌షాప్ నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎఫ్ఎస్ఎల్ఏ లైసెన్స్ అనుమతులు లేకుండా విక్రయాలు జరుపుతున్న వారికి నోటీసులు ఇచ్చారు. మద్యం దుకాణాల్లోని మద్యం ఆహార పరిరక్షణ ప్రమాణాలకు అనుగుణంగా లేవని అనుమానించి వివిధరకాల మద్యం బాటిళ్లను శాంపుల్స్‌గా సేకరించారు. శాంపుల్స్ నివేదికల ఆధారంగా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సు తప్పనిసరిగా పొందాలన్నారు.

దాడికి పాల్పడిన ఇద్దరు మైనర్లపై కేసు

తిప్పర్తి, జూలై 6 : మద్యం మత్తులో రెవెన్యూ అధికారిపై దాడికి పాల్పడిన ఇద్దరు మైనర్ బాలుర్లపై నల్లగొండ జిల్లా తిప్పర్తి పోలీస్‌స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం తిప్పర్తి తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐగా విధులు నిర్వహిస్తున్న బచ్చలకూరి నరహరిప్రసాద్ శుక్రవారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో తన కార్యాలయం నుంచి కాలకృత్యాల నిమిత్తం ఆఫీస్ ఎదురుగా ఉన్న రోడ్డుపైకి వచ్చాడు. అదే సమయంలో మండల కేంద్రానికి చెందిన ఒక బాలుడు, మండలంలోని సర్వారం గ్రామానికి చెందిన మరో బాలుడు ఇద్దరు మద్యం సేవించి అటుగా వస్తున్న ఆర్ఐని ఇక్కడ ఏం చేస్తున్నావ్ అంటూ బూతులు తిట్టారు. ఈ క్రమంలో ఎందుకు తిడుతున్నారు అని అడిగినందుకు తనపై దాడి చేసి రాళ్ల విసిరారు. దీంతో అక్కడి నుంచి తప్పించుకున్న ఆర్ఐ తన కార్యాలయ సిబ్బందికి సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకోగానే సదరు బాలురు ఇద్దరు పరారయ్యారు. జరిగిన విషయంపై తిప్పర్తి పోలీస్‌స్టేషన్‌లో ఆర్ఐ ఫిర్యాదు చేయగా విచారణ జరిపిన పోలీసులు ఇద్దరు మైనర్లను గుర్తించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పాత నేరస్థుల అరెస్టు

చౌటుప్పల్ రూరల్ జూలై 6: యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌గేటు సమీపంలో ఇద్దరు పాత నేరస్థులను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ పట్టణం మల్కాజిగిరి పరిధిలోని పటేల్‌నగర్‌కు చెందిన మక్కనోల్ల పవన్‌కుమార్, బరిగెల శివకుమార్‌లు కూలీ పనిచేస్తుంటారు. వీరిపై హైదరాబాద్, రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలో పలు దోపిడీ కేసులు ఉన్నాయి. ఈ క్రమంలో శనివారం హైదరాబాద్ నుంచి చిట్యాల వైపు యాక్టివా వాహనంపై వెళ్తుండగా పంతంగి టోల్‌గేటు వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులకు పట్టుబడ్డారు. నిందితుల నుంచి కత్తి, వాహనం స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలించారు. సీఐ అశోక్‌రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నిస్వార్థంగా పనిచేస్తే తగిన గుర్తింపు

● ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి



సన్మానం పొందిన ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీలు

తిరుమలగిరి (సాగర్), జూలై 6: నిస్వార్థంగా పనిచేస్తే ప్రజాప్రతినిధులకు, రాజకీయ నాయకులకు ప్రజల్లో మంచి ఆదరణ, గుర్తింపు లభిస్తాయని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం నిర్వహించిన మండల పరిషత్ ప్రజాప్రతినిధుల వీడ్కోలు సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రజలకు సేవ చేసేందుకు రాజకీయ నాయకులకు రిటైర్‌మెంట్ ఉండదని, పదవులు తాత్కాలికమని మంచి చేస్తే తగిన గుర్తింపు ఉంటుందన్నారు. మండల అభివృద్ధికి కృషి చేసిన ఎంపీటీసీలను పలువురు కొనియాడారు. ఈ సందర్భంగా ఎంపీపీ భగవాన్‌నాయక్, జడ్పీటీసీ అంగోతు సూర్యభాష్యనాయక్‌లతో పాటు పలువురు ఎంపీటీసీలకు ఆయన శాలువాలు కప్పి అభినందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు పుట్లూరు రాజశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీలు కాశయ్య, సుజాత, భార్గవి, అమ్లి, రామనర్సమ్మ, విజయ్, కోఆప్షన్ సభ్యుడు షేక్.రహీం, ఎంపీడీవో రమేష్, మాజీ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలి : బీఎల్ఆర్



పారిశుధ్య సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ టౌన్, జూలై 6: పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం తెల్లవారుజామున పారిశుధ్య కార్మికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైనేజీలు, వ్యర్థాలను శుభ్రపరుస్తూ ప్రజలకు ఆరోగ్యం, ఆహ్లాదం అందించేది పారిశుధ్య కార్మికులేనని కొనియాడారు. వర్షాకాలంలో ప్రతీ కార్మికుడు మరింత బాధ్యతగా పనిచేయాలన్నారు. పట్టణాన్ని అందంగా, ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు సహకారం అందించాలని సూచించారు. పంద్రాగస్టులోగా పట్టణాన్ని చెత్త రహితంగా మార్చాలని కోరారు. సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. కార్మికులకు అండగా నిలుస్తానని ఆయన హామీ ఇచ్చారు.

ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజులను నియంత్రించాలి

● ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు సురేష్



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సురేష్

దేవరకొండ, జూలై 6: ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజులను నియంత్రించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు సురేష్ డిమాండ్ చేశారు. దేవరకొండ ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో శనివారం నిర్వహించిన డివిజన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి విచ్చలవిడిగా ఫీజులు వసూళ్లు చేస్తున్నాయని ఆరోపించారు. పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు అమ్ముతున్నారని, అనుమతి లేకుండా కళాశాలలు, పాఠశాలలు నడుస్తున్నాయని ఆరోపించారు. అధికారులు విచారణ చేసి యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలపై ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాడుతుందన్నారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు రమావత్ లక్ష్మణ్‌నాయక్, బొడిగె వెంకటేష్, రవి, రాహుల్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం పెంచి పర్యావరణాన్ని కాపాడాలి



దోరెపల్లిలో మొక్కలను నాటుతున్న శ్రీనివాస్‌గౌడ్

కనగల్, జూలై 6: పచ్చదనం పెంచి పర్యావరణాన్ని కాపాడాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్ కోరారు. డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకుని శనివారం మండలంలోని దోరెపల్లి గ్రామంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అమ్మపేరున ఒక మొక్క కార్యక్రమంలో భాగంగా శ్రీనివాస్‌గౌడ్ తన తల్లిదండ్రులు అంజమ్మరాంశెట్టిలతో కలిసి వివిధ రకాల పండ్ల మొక్కలను నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలను నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పులకరం బిక్షం, నాయకులు దాసరి వెంకన్న, వంగూరి శంకర్, ఏడుకొండలు, శేఖర్‌గౌడ్, సైదులు, బాలకృష్ణ, నరేందర్, రమేష్, శివయ్య, రవి, శంకర్, శ్రీధర్, రాజు, చందు పాల్గొన్నారు.

చింతపల్లి: ప్రముఖ రాజకీయ వేత్త డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతిని మండలకేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బీజేపీ మండల అధ్యక్షుడు శివర్ల రమేష్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బీజేపీ నాయకులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చెనమోని రాములు, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి వెన్నం శేఖర్, నాయకులు బొడ్డు మహేష్, గజ్జె అభినవ్, నరేష్, నగేష్, శ్రీశైలం, అంజనేయులు, శివ పాల్గొన్నారు.

అన్ని డిపోల నుంచి అరుణాచలానికి బస్సులు

నల్లగొండ, జూలై 6: తమిళనాడులోని అరుణాచలం ఆలయంలో గిరి ప్రదక్షిణ కోసం ప్రతీ పౌర్ణమికి ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని అన్ని డిపోల నుంచి ప్రత్యేక బస్సులను నడిపిస్తున్నట్లు ఆర్టీసీ ఆర్ఎం రాజశేఖర్ తెలిపారు. ప్రతీ నెలా పౌర్ణమికి రద్దీని బట్టి ప్రత్యేక సర్వీసులు నడిపిస్తామన్నారు. అరుణాచలం వెళ్లే భక్తులకు ఆంధ్రప్రదేశ్‌లోని కాణిపాకం, తమిళనాడు రాష్ట్రంలోని వెల్లూరులోని గోల్డెన్ టెంపుల్ దర్శనం ఉంటుందని తెలిపారు. వివరాల కోసం సమీప బస్టాండుల్లో సంప్రదించాలని కోరారు.

దేవరకొండలో విజృంభిస్తున్న జ్వరాలు

» నియోజకవర్గంలో పెరుగుతున్న సీజనల్ వ్యాధులు

» ప్రభుత్వ ఆసుపత్రికి పెరిగిన రోగుల సంఖ్య



దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చిన రోగులు



దేవరకొండ, జూలై 6: దేవరకొండ నియోజకవర్గంలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. వాతావరణంలో మార్పులు రావడంతో సీజనల్ వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జ్వరాలు, కీళ్లనొప్పులు, మలేరియా వంటి రోగాలతో ప్రజలు ఆసుపత్రులకు చేరుతున్నారు. దేవరకొండ ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో ఇటీవల రోగుల సంఖ్య గణనీయంగా పెరిగిందని వైద్యులు చెబుతున్నారు. దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి దేవరకొండ, చందంపేట, నేరేడుగొమ్ము, నాంపల్లి, మర్రిగూడ, గుర్రంపోడు, డిండి, పీఏపల్లి, కొండమల్లేపల్లి మండలాల నుంచి వైద్యం కోసం రోగులు వస్తుంటారు. గత నెలలో రోజుకు 400 నుంచి 500 వరకు రోగులు వైద్యానికి వస్తుండగా ఇటీవల 600 నుంచి 700 వరకు రోగుల సంఖ్య పెరిగిందని డాక్టర్లు చెబుతున్నారు. జ్వరాలు, మలేరియా, కీళ్లనొప్పులు తదితర రోగాలతో ప్రజలు ఇబ్బందులు పడుతూ ఆసుపత్రికి వస్తున్నారని, వారందరికీ మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఓపీ సేవలు అందిస్తారు. డయాలసిస్ బెడ్లు, ఆక్సిజన్ ఏర్పాటు చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతుండటంతో ప్రభుత్వ ఆస్పత్రితో పాటు ప్రైవేట్ ఆసుపత్రులు కూడా కిటకిటలాడుతున్నాయి.

ఇదే అదునుగా భావించిన ప్రైవేట్ ఆసుపత్రుల వైద్యులు విపరీతంగా ఫీజులు వసూళ్లు చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. వర్షాకాలం కావడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, దోమల బెడద, కలుషిత నీరు తాగడం వల్లే మలేరియా, ఇతర వ్యాధులు ప్రబలుతున్నాయని డాక్టర్లు తెలియజేస్తున్నారు. పారిశుధ్యం, పరిసరాలను శుభ్రపరుచుకోవాలని, కాచి, వడపోసిన నీరు తాగాలని సూచనలు ఇస్తున్నారు. సీజన్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి



దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు డాక్టర్లు, సిబ్బంది మెరుగైన వైద్యం అందించాలి. పేద రోగులపట్ల నిర్లక్ష్యం వహించవద్దు. సీజన్ వ్యాధులు ప్రబలుతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోగులకు అనుగుణంగా ప్రభుత్వం వైద్యసేవలు అందించాలి.

- సురేష్, తూర్పుపల్లి, దేవరకొండ మండలం

ఆస్పత్రికి రోగుల సంఖ్య పెరిగింది



దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి రోగుల సంఖ్య ఇటీవల విపరీతంగా పెరిగింది. రోజుకు 700 నుంచి 800 మంది వరకు జ్వరం, మలేరియా, కీళ్లనొప్పులు, కాళ్లనొప్పులు, ఇతర వ్యాధులతో బాధపడుతూ ఆసుపత్రికి వైద్యం కోసం వస్తున్నారు. ఆసుపత్రిలో డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉండి రోగులకు వైద్యసేవలు అందిస్తున్నారు. సీజన్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

- డాక్టర్ రాములునాయక్, సూపరింటెండెంట్, దేవరకొండ

జగ్జీవన్‌రాం ఆశయసాధనకు కృషిచేయాలి



నల్లగొండలో జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నల్లగొండ టౌన్, దేవరకొండ, హాలియా, నకిరేకల్, జూలై 6: దళితులు, బహుజనులు, అణగారిన వర్గాల సంక్షేమం కోసం కృషి చేసిన సంఘ సంస్కర్త, దేశ మహోన్నత వ్యక్తి భారత ఉపప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రాం అని పలువురు కొనియాడారు. ఆయన ఆశయసాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. బాబు జగ్జీవన్‌రాం వర్ధంతిని శనివారం జిల్లాలో వివిధ పార్టీలు, సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దేశంలోని పీడిత ప్రజల హక్కుల కోసం పోరాడిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. జగ్జీవన్‌రాం మంచి రాజకీయవేత్తగా, దేశ ఉపప్రధానిగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసి భారతదేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడానికి ఎంతో కృషి చేసినట్లు తెలిపారు.

● నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కళాశాల ఎదుట ఉన్న జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ పెరిక కరణ్‌జయరాజ్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు వడ్డెబోయిన సైదులు పూలమాలలు వేశారు. ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకిశాల వెంకన్న, ఇస్తారి, ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు సైదులు, సింగం శ్రీకాంత్, పున్న సత్యం, కందుల మోహన్ పాల్గొన్నారు.

● టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగిళ్ల మురళి, ప్రధాన కార్యదర్శి శేఖర్‌రెడ్డి జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యూనియన్ అసోసియేటెడ్ ప్రెసిడెంట్ రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహచారి, పట్టణ అధ్యక్షుడు లక్ష్మయ్య, నాయకులు దశరథ, విజయకృష్ణ, సైదులు తదితరులు పాల్గొన్నారు.

● కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎన్జీ కళాశాల ఎదుట గల జగ్జీవన్‌రాం విగ్రహానికి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీలు పాశం రాంరెడ్డి, వంగూరి లక్ష్మయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్, నాయకులు సైదిరెడ్డి, గోలి రవి, గిరి, జయకుమార్, వీరబ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

● దేవరకొండలో ప్రజాసంఘాలు, దళిత సంఘాల ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల జిల్లా అధ్యక్షుడు కంబాలపల్లి వెంకటయ్య, నాయకులు భాస్కరచారి, పొట్ట సుగుణయ్య, ఎర్ర ఆంజనేయులు, ఇద్దయ్య, రఘురాములు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

● హాలియా పట్టణంలోని మునిసిపల్ కార్యాలయం ఎదుట ఉన్న బాబు జగ్జీవన్‌రాం విగ్రహానికి మునిసిపాలిటీ చైర్‌పర్సన్ సలహాదారుడు యడవల్లి నరేందర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు నకిరేకంటి సైదులుమాదిగ, పార్టీ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, నాయకులు పిల్లి అంజనేయులు, గౌని రాజారమేష్‌యాదవ్, వెంకటయ్య, సైదులు, ప్రసాద్‌నాయక్, శ్రీనివాస్, రమణయ్య, ముత్యాలు, బాబుద్దీన్, రంజిత్, కందుల మదన్‌రెడ్డి, రామలింగయ్య, నగేష్ పాల్గొన్నారు.

● నకిరేకల్ పట్టణంలోని జగ్జీవన్‌రాం విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వీరేశం సతీమణి పుష్ప, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మాచర్ల సైదులు మాదిగ, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అంజయ్య, పీఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు నూనె వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండలో నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నివాళులర్పిస్తున్న నాయకులు



నకిరేకల్‌లో నివాళులర్పిస్తున్న పుష్ప



ప్రమోటర్‌ను సన్మానిస్తున్న మత్స్యశాఖ అధికారి

మత్స్య పారిశ్రామిక సహకార సంఘం

జిల్లా అడహక్ కమిటీ ఎన్నిక

నల్లగొండ టౌన్, జూలై 6: జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా అడహక్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ భవన్‌లో నిర్వహించిన అడహక్ కమిటీ ఎన్నికల్లో చీఫ్ ప్రమోటర్‌గా కనుక వెంకటనారాయణ ఎన్నికయ్యారు. మిగిలిన పది మంది ప్రమోటర్లతో నూతన అడహక్ కమిటీని ఎన్నుకున్నారు. ఆరు నెలల నుంచి ఏడాది లోపు వరకు అడహక్ కమిటీ ఉంటుంది. కాగా ఎన్నికల అధికారిగా మత్స్యశాఖ జిల్లా అధికారి వెంకటయ్య వ్యవహరించారు. ప్రమోటర్లుగా వెలుగు రవి, జినుకుల హరిప్రసాద్, మెరుగు వెంకన్న, తౌడబోయిన అజేయ్‌కుమార్, చెన్నబోయిన వీరయ్య, జయమ్మ, సింగం లక్ష్మి, కోట్ల సైదయ్య, సూరబోయిన శ్రీనివాస్, సూర శంకర్లను ఎన్నుకున్నారు. వారికి మత్యశాఖ జిల్లా అధికారి వెంకటయ్య నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వెంకటనారాయణ మాట్లాడుతూ మత్స్య పారిశ్రామిక సంఘం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. మత్స్యకారులకు అండగా ఉంటానని వారు పేర్కొన్నారు.

బాధ్యతల స్వీకరణ

కేతేపల్లి, జూలై 6: మండల పరిషత్ పాలకవర్గ పదవీకాలం ముగియడంతో కేతేపల్లి మండల ప్రత్యేక అధికారిగా ఇటీవల నియమితులైన జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ డి.నాగేశ్వరరావు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి, ప్రభుత్వ కార్యక్రమాల విజయవంతానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు, వివిధ శాఖల అధికారులు సహకరించాలని ఆయన కోరారు.

సాగులో మెళకువలతో అధిక దిగుబడులు



రైతుకు సూచనలిస్తున్న ఏవో పురుషోత్తం

కేతేపల్లి, జూలై 6: రైతులు ఆరోగ్యకరమైన నారుమడి పెంపకంతో పంట సాగులో చీడపీడల బెడదను నివారించడంతో పాటు అధిక దిగుబడులు పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి పురుషోత్తం అన్నారు. మండలంలోని ఉప్పలపహాడ్ గ్రామంలో ప్రస్తుత వానాకాలంలో వరి సాగుకోసం రైతులు ఏర్పాటు చేస్తున్న నారుమడులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు ఆరోగ్యకరమైన నారుమడులతో కలిగే ప్రయోజనాలు, నారుమడి పెంపకంపై పలు సూచనలు చేశారు. నారుమడిని 10-12 రోజుల వ్యవధిలో మూడు దఫాలుగా దున్ని చదును చేసి మొలక చల్లాలని అన్నారు. నారుకు నీరు పెట్టడానికి, తీయడానికి వీలుగా కాల్వలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. 2 గుంటల నారుమడికి 24 కిలోల మొలక కట్టిన విత్తనాలను చల్లాలన్నారు. అలాగే 1 కిలో భాస్వరం, 1 కిలో పొటాష్ ఎరువులు దుక్కిలో వేసి విత్తనం చల్లే ముందు 1 కిలో నత్రజని, విత్తనం చల్లిన 12-14 రోజులకు మరో 1 కిలో నత్రజని ఎరువు వేయాలన్నారు. ఆయన వెంట రైతులు పర్వతాలు, హరీష్, సంజీవ ఉన్నారు.

బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా మునికుమార్



మునికుమార్

రామగిరి, జూలై 6: బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన పెరిక మునికుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి శనివారం నియామకపత్రం అందజేశారు. నూతనంగా ఎన్నికైన మునికుమార్ మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. అదేవిధంగా తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

ఎంపీడీవో కార్యాలయంలో పారిశుధ్య పనులు

కేతేపల్లి, జూలై 6: మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ సముదాయంలో శనివారం పంచాయతీ పారిశుధ్య సిబ్బంది ప్రత్యేకంగా పారిశుధ్య పనులు నిర్వహించారు. ఈ సముదాయంలోని తహసీల్దార్ కార్యాలయం, పశువుల ఆసుపత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రైతు వేదిక, ట్రాన్స్‌కో, ఎంపీడీవో కార్యాలయాలు ఉన్నాయి. ప్రస్తుత వానాకాల సీజన్‌లో ఆయా కార్యాలయాల చుట్టూ దట్టంగా పిచ్చిమొక్కలు పెరిగాయి. దీంతో ఎంపీడీవో బి.శ్రీనివాసరావు స్పెషల్ డ్రైవ్ కింద పారిశుధ్య పనుల నిర్వహణకు ఆదేశించారు. స్థానిక జీపీ కార్మికులు కార్యాలయాల చుట్టూ పెరిగిన మొక్కలను తొలగించి శుభ్రం చేశారు.

గ్రామీణ వైద్యులకు చట్టబద్ధత కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మల్సూర్

మాడ్గులపల్లి, జూలై 6: గ్రామీణ వైద్యులకు ప్రభుత్వం చట్టబద్ధత కల్పించాలని రూరల్ మెడికల్ ప్రాక్టీషనర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దోరేపల్లి మల్సూర్ అన్నారు. మండలంలోని తోపుచర్ల గ్రామంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామీణ వైద్యులు పరిమితికి మించి వైద్యం చేయకూడదని సూచించారు. అనంతరం కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి ఎండి.జాని, మండల అధ్యక్ష, కార్యదర్శులు నూకపంగ శ్రీనివాస్, పొదిల నాగరాజు, షేక్ రసూల్, నిమ్మల వెంకన్న, అక్బర్, అఫ్జల్, గడ్డమీది సైదులు, మధు, రమణ, నాగేందర్, జానిపాషా పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

నల్లగొండ, జూలై 6: విద్యుత్ శాఖ డిస్కంల నుంచి రూ.140కోట్ల ఉచిత విద్యుత్ పెండింగ్ బిల్లులను విడుదల చేసి లక్షకు పైగా ఉన్న రజక, నాయిబ్రాహ్మణులను ఆదుకోవాలని ఎంబీసీ జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ముఖ్యమంత్రితో పాటు డిప్యూటీ సీఎం, మంత్రులకు వినతిపత్రాలను పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రజక, నాయిబ్రాహ్మణులకు ఇస్తున్న 250 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని కొనసాగిస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని కోరారు. తెలంగాణలోని 71వేల మంది రజకులు లాండ్రీ షాపులు, దోబీఘాట్లు నడుపుతున్నారని, అదేవిధంగా 36 వేల మంది నాయిబ్రాహ్మణులు హెయిర్ సెల్‌లు నడుపుతున్నారని తెలిపారు. వారందరికీ సంబంధించిన విద్యుత్ కనెక్షన్లు కట్ చేయకుండా ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అన్నారు.

సంక్షిప్త సమాచారం...

దేవరకొండ: గురుకుల పాఠశాలలు, సంక్షేమ వసతిగృహాలకు నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వలమాల అంజనేయులు కోరారు. నాసిరకం బియ్యం సరఫరా చేస్తుండటంతో విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారని అన్నారు. నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేయాలని లేనిచో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

శాలిగౌరారం: శాలిగౌరారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పానగల్లులోని చారుమతి చైల్డ్ కేర్ సెంటర్‌లో నిరాదరణకు గురైన విద్యార్థులకు అన్నదానం చేశారు. అనంతరం విద్యార్థులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు డెంకల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి మారోజు వెంకటాచారి, వడ్లకొండ బిక్షం, శ్రీనివాసులు, రామ్మూర్తి పాల్గొన్నారు.

గట్టుప్పల్: అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు నేరుగా అందేవిధంగా ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతుందని కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు రావుల రమేష్ అన్నారు. తమ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు విమర్శలు మానుకోవాలని ఆయన హెచ్చరించారు. గతంలో పాలించిన ప్రభుత్వాలు ఏ మాత్రం ప్రజలను పట్టించుకోలేదని అసహనం వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు టేకుమట్ల శ్రీరాములు, యాదగిరిరెడ్డి, నగేష్, శంకరయ్య, నవీన్ కుమార్, మల్లేష్ పాల్గొన్నారు.

మాడ్గులపల్లి: మండలంలోని ఆగామోత్కూర్ కల్లుగీత కార్మిక సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామశాఖ అధ్యక్షుడిగా భూపతి విజేందర్, ఉపాధ్యక్షుడు బంటు సైదులు, కార్యదర్శి భూపతి శ్రీనివాస్, కోశాధికారి బొడ్డు రాములు, కమిటీ సభ్యులుగా చంద్రయ్య, బొడ్డు బాలకృష్ణ, వెంకన్న, శంకరయ్య, సైదులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘం బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

నార్కట్‌పల్లి: మండలంలోని గోపలాయపల్లి వారిజాల వేణుగోపాలస్వామి దేవస్థానానికి నల్లగొండ పట్టణానికి చెందిన మేక శశికుమార్ సుస్మితరాణి దంపతులు స్వామివారికి వెండి పిల్లనగ్రోవిని వెండి పిల్లనగ్రోవి బహూకరించారు. ఆలయ పూజారికి అందజేశారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామివారికి అలంకరించనున్నారు.

శాలిగౌరారం: మండలంలో ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్లు వరి పొలాల దున్నకాల సీజన్ మొదలవడంతో ప్రధాన రహదారులపై ఇష్టానుసారంగా ఫుల్‌వీల్స్ నడపడం వల్ల రోడ్లన్నీ ధ్వంసమవుతున్నాయని ఎస్ఐ వాసా ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఫుల్‌వీల్స్‌తో రోడ్లపై వెళ్లే ట్రాక్టర్లను అక్కడికక్కడే సీజ్ చేయడంతో పాటు లైసెన్స్‌ను రద్దు చేసి కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. వర్షాకాలంలో ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉందని, ప్రతీ ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని అన్నారు.

దేవరకొండ: నకిరేకల్ పట్టణంలో ఈ నెల 13, 14, 15 తేదీల్లో నిర్వహించే ఎస్ఎఫ్ఐ నల్లగొండ జిల్లా స్థాయి విద్య, వైజ్ఞానిక సదస్సును విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్ పిలుపునిచ్చారు. శిక్షణకు 200 మంది విద్యార్థి ప్రతినిధులు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, వెంకటేష్, రాకేష్, చరణ్, ఇద్దిరాములు, మంజుల, జ్యోతి, బేగం పాల్గొన్నారు.

చింతపల్లి: చింతపల్లి మండల ప్రాథమిక పాఠశాలలో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను పలువురు సన్మానించారు. పాఠశాలకు వారు ఆదర్శంగా ఉంటూ విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు తోడ్పాటు అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కొండూరి అంజనేయు లు, రేగట్టి లక్ష్మి, రాజేశ్వరి, అలివేలు, లక్ష్మీబాయి పాల్గొన్నారు.

దేవరకొండ: ప్రభుత్వం ఎన్నికల హామీలన్నీ అమలుచేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ పోవడానికే సమయం సరిపోతుందని ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. వర్షాకాలం సీజన్ ప్రారంభమైనందున రైతుభరోసా డబ్బులు విడుదల చేయాలన్నారు.

చండూరు: ప్రభుత్వం ప్రకటించిన ట్రిపుల్ ఐటీ ఫలితాల్లో సన్‌షైన్ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు టి. రమ్యశ్రీ, జి. సారికలు బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించారు. ఈ సందర్భంగా పీపీసీఎస్ చైర్మన్ కోడి సుష్మ, పాఠశాల కరస్పాండెంట్ కోడి వెంకన్న విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవికాంత్, లతీఫ్‌పాషా, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చిట్యాలరూరల్: భారతజాతి జాగృతికై గళమెత్తి ఎంతోమందిని ఏకతాటిపై నడిపించిన మార్గదర్శి డాక్టర్ శ్యాంప్రసాద్‌ముఖర్జీ అని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ మైల నర్సింహ అన్నారు. శ్యాంప్రసాద్‌ముఖర్జీ జయంతిని మండలంలోని గుండ్రాంపల్లిలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో రాచకొండ నరేష్, గరిషె నరేష్, గంజి వివేకానంద, మల్లేష్, మైల పరమేష్, రాజశేఖర్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

చిట్యాలరూరల్: మండలంలోని చిన్నకాపర్తిలో వీధిలైట్ల ఏర్పాటు కోసం స్థానికంగా పలు ప్రాంతాల్లో స్తంభాలను ఏర్పాటు చేశారు. వీధిలైట్లను ఏర్పాటు చేసేందుకు స్తంభాలు లేకపోవడంతో నాయకులు ఎమ్మెల్యే వీరేశం దృష్టికి తీసుకెళ్లగా సమ్యను పరిష్కరిస్తానని హామీనిచ్చి సంబంధిత అధికారులకు సూచించగా గ్రామంలో స్థంభాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు బోయపల్లి వెంకన్నగౌడ్, మాజీ ఉపసర్పంచ్ ఆవుల రమేష్, సుందర్, వెంకటేశం, శ్రీను, సత్యనారాయణ, రాజ్‌కుమార్, లింగయ్య, కార్తీక్, రామలింగం పాల్గొన్నారు.

ప్రజాపాలన కాదు ప్రజా వ్యతిరేక పాలన

శాలిగౌరారం, జూలై 6: రాష్ట్రంలో ప్రజాపాలన కాదు ప్రజా వ్యతిరేక పాలన కొనసాగుతుందని, త్వరలో ప్రజలు తిరగబడే సమయం ఆసన్నమైందని మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ ఉత్పత్తి పెరిగినా 24గంటల కరెంటు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. కేసీఆర్ పాలననే ప్రజలు మళ్లీ కోరుకుంటున్నారని అన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు ఐతగోని వెంకన్నగౌడ్, పార్టీ ప్రధాన కార్యదర్శి చాడ హరీష్‌రెడ్డి, నాయకులు మామిడి సర్వయ్య, కట్టా వెంకట్‌రెడ్డి, గుండా శ్రీనివాస్, శేఖర్‌బాబు, చంద్రమౌళి, నాగరాజు, వెంకన్న, నర్సయ్య, నరేందర్, రాములు, రమేష్, వెంకన్న, మహేష్, తోట సోమయ్య తదితరులు పాల్గొన్నారు.